Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 10.06.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 01 పేజీలు : 16, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## 35 ఏళ్ళ ప్రస్థానం

### • మీ గుండెల్లో చెరగని స్థానం

జర్నలిజం వ్యాపారం కాకూడదు,
జర్నలిస్టులు క్యాప్టలిస్టులుగా మారకూడదు.
అలా జరిగిన రోజున ప్రజాస్వామ్యాన్ని
పరిరక్షించే నాలుగు స్థంభాలలో
ఓ మూల స్థంభం కూలిపోయినట్టే!

- కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి
వ్యవస్థాపకులు, 'లాయర్' వారపత్రిక

పై మాటలను అక్షర సత్యం చేస్తూ, ఆయన ఆశయ సాధనలో నిరంతరం శ్రమిస్తూ... ఆయన నేర్పిన విలువలూ బోధించిన సూక్తులూ నిత్యం పాటిస్తూ గత 35సంవత్సరాలుగా నెల్లూరీయుల గుండెల్లో చెరగని ముద్రవేసుకుని ముందుకు సాగుతోంది మా(మీ) 'లాయర్'.

నిజాన్ని నిర్భయంగా చెప్పే పత్రికగా, నెల్లూరీయుల మనసెరిగిన సేవాదీపికగా, వాస్తవాలను జంకూ బొంకూ లేకుండా వెలుగులోకి తెచ్చే సత్య వేదికగా, సమాజశ్రేయస్సే ధ్యేయంగా ఆవిర్భవించిన వార్తా వీచికగా "లాయర్" వారం వారం అక్షర యజ్ఞాన్ని కొనసాగిస్తోంది.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ ప్రతి సెకనుకీ ఓ బ్రేకింగ్ వార్తతో ప్రత్యక్ష ప్రసారాలను అందిస్తున్న టి.వి.ఛానళ్ళు, ఎవరికి వారే ఒకరికొకరు పోటీగా ఆధిపత్యం కోసం పోరాడుతున్న దినపత్రికలు, అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తూ క్షణాల్లో 'క్లిక్'మంటూ మెసేజ్‌ల ద్వారా న్యూస్ అందిస్తున్న ఇంటర్నెట్ బ్లాగులూ... వీటన్నిటి మధ్య నేనూ వున్నానంటూ తన వునికి చాటుకుంటూ 36వ యేట అడుగుపెట్టింది మా(మీ) 'లాయర్'.

ఈ విజయం 'లాయర్' ఆత్మీయులదే. ఈ ఘనత 'లాయర్' పాఠకులదే. ఈ సంబరం తమ కుటుంబంలో భాగంగా 'లాయర్'ని ఆదరిస్తున్న నెల్లూరీయులదే! మారుతున్న కాలంతో పాటు తానూ మారుతూ ఎప్పటికప్పడు ఆధునిక ఆలోచనలతో సరికొత్త ప్రయోగాలతో నూతన ప్రతిపాదనలతో అప్తుల ముందుకొచ్చిన ప్రతిసారి నీ వెంట మేమున్నాం అంటూ వెన్నుతట్టి ముందుకు నడిపించిన ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు.

ఈ ముప్పై అయిదేళ్ళుగా ఎన్నో అక్రమాలను వెలికితీసి ఎందరో అక్రమార్కుల భాగోతాలను బట్టబయలు చేసింది మా(మీ) 'లాయర్'. "మంచికి చప్పట్లు చెడుకి చీవాట్లతో" ఎప్పటికప్పడు తన వాణిని వినిపిస్తూ... సమాజ శ్రేయస్సు కోసం నినదిస్తూ ప్రపంచం నలుచెరగులా వున్న ప్రియ నెల్లూరీయుల మనసులు దోచుకుంటూ వారి శుభాశీస్సులను మనసులో దాచుకుంటూ నూతనోత్సాహంతో ముందడుగు వేస్తోంది మా(మీ) 'లాయర్'.

ఒక చిన్న పత్రిక, స్థానిక పత్రిక, వారపత్రిక 35సంవత్సరాల సుదీర్ఘకాలం మనుగడ సాగిస్తూ వారం వారం నిరంతరాయంగా వెలువడుతూ ముందుకు సాగడం సామాన్యమైన విషయం కాదు. ఎక్కడా రాజీపడకుండా ఎవరికీ తలవంచకుండా తనదైన ఒరవడితో జిల్లాలోనే నెంబర్ వన్‌గా నిలవ గలగడం అసాధారణం. ఈ అపూర్వ విజయం అఖండ ప్రస్థానం అద్భుత ప్రయాణం కేవలం 'లాయర్' ఆత్మీయుల అండదండలతోనే సాధ్యం అని మరోసారి అందరికీ వినమ్రంగా మనవి చేసుకుంటూ... ఈ ఆత్మీయత, ఆదరణ, ఆశీస్సులు కలకాలం ఇలాగే అందిస్తారని ఆకాంక్షిస్తూ... ఆదరించి ఆశీర్వదిస్తున్న ప్రతిఒక్కరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాం...!

తుంగా శివప్రభాత్‌రెడ్డి
సం/-

# నవ నిర్మాణ నాటకం



- రెండేళ్ళలో కనపడని ప్రగతి
- కోటలు దాటిన అవినీతి
- గట్టి మాటలు, వట్టి చేతులే!
- దీక్షల వల్ల ప్రయోజనమేంటో?

*కొందరి దగ్గర పని ఉంటుంది. మాటలుండవు. పి.వి.నరసింహారావు లాంటి నాయకుడన్న మాట! ఇంకొందరి వద్ద మాటలతో పాటూ పనులు కూడా ఉంటాయి. వాజ్‌పేయి, నరేంద్ర మోడీల మాదిరిగా! మరికొందరి వద్ద మాటలే వుంటాయి. పని ఉండదు. మన చంద్రబాబునాయుడులాగా!*

రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడ్డ నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనకు ఈ నెల 8తో రెండేళ్ళు పూర్తయ్యాయి. ఈ రెండేళ్లలో మనం అభివృద్ధిని చూల్లేదు. కాకపోతే అభివృద్ధి గురించి గ్యాప్ లేకుండా వింటున్నాం. రెండేళ్ల నుండి అమరావతి రాజధాని గురించి వింటూనే వున్నాం. అమరావతిని సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్, బీజింగ్, టోక్యో, వాషింగ్టన్‌ల మాదిరిగా చేస్తానన్న చంద్రబాబు మాటలను ఇంకా వింటూనే వున్నాం. చిత్తూరుజిల్లా ఎడ్యుకేషన్ హబ్, నెల్లూరు జిల్లా పవర్ హబ్, కడప జిల్లా పరిశ్రమల హబ్, విశాఖజిల్లా టూరిజం... అంటూ చంద్రబాబు చెబుతున్న మాటలను వింటూనే వున్నాం. అవినీతి రహిత పాలనను అందిస్తామని చెప్పిన మాటలనూ (మిగతా 15వ పేజీలో)

# జగన్ మొండి

### దూకుడు పెంచిన విపక్షనేత



*రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికార జులుం చూపిస్తోంది. ధనం, అధికార బలంతో రాష్ట్రంలో ప్రతిపక్షాన్నే లేకుండా చేయాలని చూస్తోంది. కోట్లాది రూపాయలు ఆశపెట్టి వైకాపా ఎమ్మెల్యేలను కొంటోంది. ఇప్పటికే వైసిపి నుండి 19మంది దాకా ఎమ్మెల్యేలు వెళ్లిపోయారు. పార్టీని నిలబెట్టుకోవడం కష్టమేమో... అన్నంత పరిస్థితిని తీసుకొచ్చారు.* (మిగతా 15వ పేజీలో)



## భూ ప్రకంపనలపై...

# పుకార్లు నమ్మొద్దు!

**- జిల్లా కలెక్టర్ యం.జానకి**



నెల్లూరుజిల్లాలోని వింజమూరు, వరికుంటపాడు తదితర ప్రాంతాల్లో అప్పుడప్పుడు సంభవిస్తున్న భూప్రకంపనలు చిన్నవేనని, దీనివల్ల ప్రజలు భయాందోళనలు చెందవద్దని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి సూచించారు. నెల్లూరు కలెక్టర్ బంగ్లాలో మంగళవారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ భూప్రకంపనలు రిక్టార్ స్కేలుపై 2.5, 3.4గా మాత్రమే నమోదయ్యాయన్నారు. భూమిలో 3 నుంచి 5కిలోమీటర్ల లోపు భూప్రకంపనలు సంభవిస్తున్నాయన్నారు. ఈ విషయంపై వస్తున్న పుకార్లను నమ్మవద్దన్నారు. పుకార్లు సృష్టించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వింజమూరు, వరికుంటపాడు, చాకలికొండ కేంద్రంగా భూప్రకంపనలు వస్తున్న నేపథ్యంలో ఆయా ప్రదేశాల్లో పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏడాదిపాటు పూర్తి స్థాయిలో పరిశోధన జరుగుతుందన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

## భూ ప్రకంపనలపై పరిశోధనలు

భూ ప్రకంపనలపై పరిశోధనలు చేస్తున్నామని జియాలాజికల్ రీసర్చ్ సెంటర్ శాస్త్రవేత్త సి.నగేష్ తెలిపారు. భూప్రకంపనలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భూమి 6371కిలోమీటర్ల లోతు ఉందన్నారు. ఈ ప్రాంతం 3వ జోన్‌లో ఉందని, రిక్టార్‌స్కేలుపై 3.4గా భూప్రకంపనలు నమోదు కావడంతోనే శబ్దాలు వస్తున్నాయన్నారు. ప్రజలు భయపడవద్దని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా, ఆత్మకూరు ఆర్‌డిఓ ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# బ్రతకలేకుంటే బ్రతికించు!

**- మహోద్యమంలా అవయవదానం**



నారాయణమ్మ

సింహపురి సమాచారం

***ఆరిపోయే దీపంతో ఇంకొన్ని దీపాలను వెలిగించవచ్చు. కాకపోతే ఆ ఆలోచన రావాలంతే! బ్రతుకులూ అంతే... ఆరిపోయే ఒక జీవితం పది జీవితాలకు వెలుగు తేగలదు. మనం బ్రతుకుతూ పదిమందిని బ్రతికించడం ఒక ఎత్తయితే, మనం మరణించినా, ఇప్పుడు నలుగురిని బ్రతికించడం మానవతా వనంలో వెలసిన ఒక కొత్త కాన్సెప్ట్! ఆ కాన్సెప్ట్ పేరే అవయవదానం. దీనికి పేద, కోటీశ్వరుల తేడా లేదు. కుల మతాల పట్టింపులేదు. వర్గం, వర్ణం విచక్షణ లేదు. మానవత్వం ఉన్న మనుషులైతే చాలు.***

అవయవదానం... ఇప్పుడు దేశమంతా ఒక ఉద్యమంలా జరుగుతోంది. ఇదొక మానవతా ప్రక్రియ. నేను చావు అంచుల్లో వున్నా, నా వల్ల నలుగురికి పునర్జన్మ రావాలని కోరుకునే మహోన్నత దృక్పథం. ఈ గొప్ప మానవతా ఉద్యమంలో నెల్లూరు జిల్లా వాసులు మేము సైతం ఓ సమిధను అందిస్తామంటూ ముందుకొస్తుండడం చూస్తుంటే వారికి జేజేలు పలికినా తక్కువే!

బ్రెయిన్‌డెడ్‌కు గురై ఇక కోలుకోవడం కష్టమనుకున్న దశలో ఆ వ్యక్తుల అవయవదానాలకు కుటుంబసభ్యులు మానవతా దృక్పథంతో ముందుకొస్తున్న సంఘటనలు జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. ఈ నెల మొదటివారంలో దొరవారిసత్రం మండలంలో చోటు చేసుకున్న సంఘటనే దీనికి ఉదాహరణ. ఈ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నారాయణమ్మ ఈ నెల 1వ తేదీన ఉతికిన బట్టలను ఆరేసేందుకు మిద్దెపైకి వెళ్లి బట్టలను ఆరేస్తూ ప్రమాదవశాత్తు క్రింద పడిపోయింది. భర్త వెంకయ్య ఇది గమనించి వెంటనే నాయుడుపేట ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు ప్రాథమికి చికిత్స చేసి నెల్లూరుకు తీసుకుపోండని సూచించారు. వెంకయ్య ఆమెను పెద్దాసుపత్రికి తీసుకొచ్చాడు. పెద్దాసుపత్రిలో సిబ్బంది పేషంట్లను ఎంత బాగా చూస్తారో మనకు తెలిసిన విషయమే కదా! ఉదయం 11గంటలకు పేషంట్‌ను తీసుకొస్తే మధ్యాహ్నం 3గంటల దాకా ఆమెను పట్టించుకో లేదు. దీంతో ఆమెను బొల్లినేని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమెకు పరీక్షలు నిర్వహించిన ఆసుపత్రి వైద్యులు ఆమెకు మెడ భాగంలో బలమైన దెబ్బ తగలడం వల్ల కోమాలోకి వెళ్లిందని, ఇక బ్రతకడం కష్టమని నిర్ధారించారు. నారాయణమ్మను ఎలాగూ బ్రతికించుకోలేము, కనీసం ఆమె అవయవాలతో మరికొందరిని బ్రతికిద్దామని వైద్యులు ఇచ్చిన సలహా ఆమె భర్త వెంకయ్యను, కుటుంబసభ్యులను కదిలించింది. వారు అందుకు అంగీకరించడంతో బొల్లినేని వైద్యులు జీవన్‌దాన్ ట్రస్ట్ అనుమతి పొంది అవయవాలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 3న నారాయణమ్మకు ఆపరేషన్ నిర్వహించి గుండె, ఊపిరితిత్తులను ఎయిర్ అంబులెన్స్‌లో చెన్నైలోని పోర్టిస్‌మలార్ ఆసుపత్రికి తరలించారు. ఆ ఆసుపత్రిలో 8ఏళ్ల చిన్నారికి విజయవంతంగా గుండెను అమర్చారు. కాలేయంను విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి, ఒక కిడ్నీని కిమ్స్ ఆసుపత్రికి, ఇంకో కిడ్నీని నారాయణ ఆసుపత్రికి తరలించగా, నేత్రాలను మాదరన్ కంటి ఆసుపత్రి వాళ్లు సేకరించారు. ఇలా నారాయణమ్మ ఒక్క దీపంగా ఆరిపోయినా 8 ఇళ్లల్లో దీపమై వెలిగింది. నారాయణమ్మ పేదింటి ఆడబిడ్డ అయినా తన అవయవదానంతో ధనంతో వెలకట్టలేని మానవతను తన చరిత్రలో రాసుకుంది.

దాదాపు ఏడాది కాలంలో జిల్లాలో 5మంది దాకా అవయవదానం చేశారు. ఈ ఉద్యమం మున్ముందు మరింత చైతన్యవంతమై ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదించవచ్చు. ఈ స్ఫూర్తిజ్యోతిని వెలిగించిన అవయవదాతలు, వారి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు చెప్పినా కూడా తక్కువే!




తుంగా రాజగోపాలరెడ్డి
వ్యవస్థాపకులు

నెల్లూరోళ్ళు ఎక్కడున్నా ఇంటర్నెట్ ద్వారా
వారం వారం పలుకరిస్తూ...
నెల్లూరు వాణిని వినిపిస్తున్న...
లాయర్
తెలుగు వారపత్రికకు
35వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

డా॥ పెన్న మోహన్‌రెడ్డి
డా॥ రామిరెడ్డి కేశవరామిరెడ్డి
U.S.A

# పాతోళ్లే... ఇక పగోళ్లు!







- సీనియర్‌లకు మొండి చేయి... అలిగి రూరల్‌ను తెచ్చుకున్న ఏపిఆర్





***'ముందొచ్చిన చెవుల కంటే వెనుకొచ్చిన కొమ్ములు వాడి' అన్న సామెత ఇప్పుడు తెలుగుదేశం నాయకులకు కరెక్ట్‌గా సరిపోతుంది. తెలుగుదేశంలో కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌ల నుండి వచ్చిన నాయకులకు ఇస్తున్న గౌరవమర్యాదలు, బాధ్యతలు, పార్టీని ఎప్పట్నుండో కనిపెట్టుకుని వున్న వారికి దక్కడం లేదు. దీంతో తమ పార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం తెలుగుదేశం నిఖార్సు నాయకులలో కరువైంది. కొత్త వాళ్లొచ్చి తమ మీద పెత్తనం చేస్తున్నరన్న బాధ వారిలో ఎక్కువుగా కనిపిస్తోంది.***

నెల్లూరుజిల్లాలో మూడు నియోజకవర్గాలకు చెందిన నాయకత్వాల మార్పులు ఆ పార్టీ సీనియర్ నాయకులకు ఏ మాత్రం మింగుడుపడడం లేదు. నెల్లూరురూరల్‌కు మంత్రి పి.నారాయణను, నెల్లూరు నగరానికి ఆనం వివేకానందరెడ్డిని, ఆత్మకూరుకు ఆనం రామనారాయణరెడ్డిని ఇన్‌ఛార్జ్‌లుగా నియమించుకున్నారన్న సమాచారం ఆ నియోజకవర్గాలను నమ్ముకుని వున్న నాయకులకు నిద్ర పట్టనీయడం లేదు.

ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు పార్లమెంటుతో పాటు నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా కూడా వున్నాడు. పార్లమెంటు ఇన్‌ఛార్జ్‌గా పనేమీ వుండదు కాబట్టి రూరల్‌పైనే ఎక్కువ దృష్టిపెట్టాడు. ఇప్పుడు నారాయణ ఇన్‌ఛార్జ్ అయితే ఆదాల రూరల్‌లో వేలుపెట్టే పరిస్థితి ఉండదు. అలాగే ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గత ఎన్నికల్లోనే నెల్లూరు రూరల్ నుండి పోటీ చేయాలనుకున్నాడు. మొన్న బీజేపీకిచ్చారు. రేపు అవకాశం వస్తే ఆయన పోటీ చేయాలనుకునేది రూరల్ నుండే! ఇక నారాయణ ఇన్‌ఛార్జ్ అయితే రవిచంద్ర ఆశలు గల్లంతే! నారాయణకు ఇన్‌ఛార్జ్ ఇచ్చారని అలిగి ఆదాల నవనిర్మాణ సంకల్ప సభలకు కూడా పోలేదు. దీంతో చంద్రబాబు ఆయనను పిలిచి బుజ్జగించి కేవలం నవనిర్మాణసభల కోసమే నారాయణను రూరల్ ఇన్‌ఛార్జ్‌గా నియమించామని, తర్వాత నువ్వే అక్కడ ఇన్‌ఛార్జ్‌వని చెప్పి అలకతీర్చాడు.

ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్‌గాను, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కన్వీనర్‌గానూ వ్యవహరిస్తున్నారు. 2014ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ సీటు కోసం గట్టిగా ప్రయత్నించాడు. కాని అప్పుడే పార్టీలో చేరిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి సీటును దక్కించుకున్నాడు. రాబోయే ఎన్నికలకు వీళ్లిద్దరూ మళ్లీ రేసులో నిలుస్తారు. కాని ఈలోపు ఆనం వివేకాకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఇస్తే వారి ఆశలకు ముగింపు పలికినట్లే!

2014 ఎన్నికల్లో ఆత్మకూరు నుండి తెలుగుదేశం తరపున పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థి లేక గూటూరు కన్నబాబును దించారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేయమని చంద్రబాబు అప్పుడు మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డిని కోరినా, సీఎం మూడ్‌లో వుండి ఆయన ఒప్పుకోలేదు. రామనారాయణరెడ్డి ఆరోజే టీడీపీ అభ్యర్థి అయ్యుంటే ఆత్మకూరుతో పాటు నెల్లూరు లోక్‌సభ ఫలితాలు కూడా వేరేగా ఉండేవి. విధిలేని పరిస్థితుల్లోనే అక్కడ కన్నబాబును దించారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయినా, కన్నబాబు ఆత్మకూరును వదిలిపెట్టకుండా అక్కడ పార్టీ కార్యక్రమాలతో పాటు అధికార కార్యకలాపాలలో వేలుపెడుతున్నాడు. పార్టీలోకి రామనారాయణరెడ్డిని తీసుకోవడాన్ని అతను వ్యతిరేకించాడు. ఆనం చేరాక కూడా అతనికి దూరంగానే ఉంటున్నాడు. ఆనం రామనారాయణరెడ్డికి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తే ఇతను కలిసిపోయే అవకాశం కూడా లేదు.

# డ్రైన్ పనులను పరిశీలించిన ఆదాల



తెలుగుదేశంపార్టీ నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి 8వ తేదీ నెల్లూరు నగరం 20వ డివిజన్ పరిధిలోని మాగుంట లేఅవుట్‌లో 69లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించాడు. మినీబైపాస్ రోడ్డుకు తూర్పు వైపున కూడా డ్రైన్ చేపట్టాలని, మాగుంట లే అవుట్ వరదల సమయంలో ముంపుకు గురికాకుండా చూడాలని ఆయన సూచించాడు. అలాగే ఆదాల 31వ డివిజన్‌లోని వైయస్ఆర్ నగర్‌లో నిర్మిస్తున్న డ్రైన్లను, బి.టి రోడ్లను కూడా పరిశీలించాడు.

ఈ కార్యక్రమంలో ఆదాల వెంట తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు ఆనం జయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు దాసరి రాజేష్, మన్నెం పెంచలయ్య, ఎం.వెంకయ్య, శైలజ, డి.రాజా, నాయకులు రాజేంద్ర, సి.హెచ్.హరిబాబుయాదవ్, సూరి, పాముల రమణయ్య, పి.కోటేశ్వరరెడ్డి, సారధి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# 'ప్రభా'తం

ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో భారత విదేశాంగ విధానం కొత్తపుంతలు తొక్కుతోంది. ప్రపంచ దేశాలలో భారత్‌ను ఓ నిర్ణయాత్మక శక్తిగా మలచడంలో ప్రధాని మోడీ చేస్తున్న కృషి ఫలిస్తున్నట్లుగానే వుంది. భారత్‌కు సుష్మాస్వరాజ్ రూపంలో విదేశీ వ్యవహారాల మంత్రి ఉన్నప్పటికి, ప్రధానే నేరుగా అన్ని దేశాలతోనూ సంబంధాలు నెరపుతుండడం బహుశా మోడీ రూపంలోనే చూస్తున్నామనిపిస్తుంది. తన రెండేళ్ల పాలనా కాలంలో మోడీ సాధించిన విజయాలలో చెప్పుకోదగ్గది విదేశాంగ విధానమే! ఒకప్పుడు భారత ప్రధాని అంటే ప్రపంచ అగ్రరాజ్యాలకు పెద్ద లెక్కుండేది కాదు. కాని ఈరోజు అగ్రరాజ్యాల అధినేతలతో సమానంగా భారత ప్రధాని గౌరవమర్యాదలు అందుకోగలుగుతున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచ వ్యవహారాలలో అమెరికా అధ్యక్షుడు తర్వాత ఇప్పుడు అత్యంత ప్రభావం చూపుతున్న నాయకుడు భారత ప్రధానే అని అనుకోవాలి.

రెండేళ్లలోనే 40కి పైగా దేశాలను చుట్టేసిన నరేంద్ర మోడీ తన ప్రపంచయాత్రను ఇంకా విరమించుకోలేదు. ఆసియా ఖండంలో ఒక్క చైనా, పాకిస్థాన్‌లో తప్ప మిగతా అన్ని దేశాలతోనూ సత్సంబంధాలను నెలకొల్పిన మోడీ అదే విధానాన్ని ఇతర దేశాల విషయంలోనూ కొనసాగించాడు. తాజాగా ఆయన జరిపిన ఆఫ్ఘాన్, ఖతార్, స్విట్జర్లాండ్, అమెరికా, మెక్సికో పర్యటనలు సైతం భారత్‌కు ప్రయోజనం చేకూర్చేవే! ముఖ్యంగా ఉగ్రవాదానికి సహకరిస్తున్న పాకిస్థాన్‌ను ఒంటరిని చేసే ప్రయత్నంలో ఆయన ముస్లిం దేశాలైన ఆఫ్ఘనిస్థాన్, ఖతార్, ఇరాన్, సౌదీ అరేబియాలలో చేసిన పర్యటనలు సానుకూల ఫలితాల నిచ్చాయని చెప్పవచ్చు. అరబ్ దేశాల పర్యటనల ద్వారా ఆయన ఉగ్రవాదానికి మతం లేదని, దానికి మతంతో పని లేదని చాటి చెప్పగలిగాడు. ఇరాన్, ఖతార్, సౌదీఅరేబియా, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలతో ఆయన కుదిర్చిన పలు ఒప్పందాలు చైనా, పాక్‌ల కడుపు మండించేవే!

2014 ఎన్నికల్లో స్విస్ బ్యాంకులో మురుగుతున్న నల్లధనాన్ని వెలికితీస్తానన్నది మోడీ ప్రధాన వాగ్దానం. అయితే ప్రధాని అయ్యి రెండేళ్లయినా ఇంతవరకు రూపాయి నల్లధనాన్ని వెనక్కు తేలేకపోయాడని ఇప్పుడు ఆయనను చుట్టిముట్టి వున్న విమర్శలు. ప్రస్తుతం ఆయన జరిపిన స్విట్జర్లాండ్ పర్యటనలో నల్లధనమే ప్రధాన అంశం. స్విస్‌బ్యాంకులో భారతీయ కుబేరులు దాచుకున్న నల్లధనాన్ని బయటపెట్టే విషయంలో ఇరుదేశాధినేతల మధ్య ఒక అవగాహన ఏర్పడడం ఈ విషయంలో ఓ ముందడుగుగా చెప్పుకోవచ్చు. ఇక 40సభ్యదేశాలున్న ఎన్ఎస్‌జి(అణు వ్యాప్తి నిరోధక సభ్యదేశాలు)లో భారత్‌కు సభ్యత్వం కోసం స్విట్జర్లాండ్ మద్దతు తెలపడం మోడీ సాధించిన ఘనతే అనుకోవచ్చు.

అన్నింటికి మించి ప్రధానంగా ప్రస్తావించుకోవాల్సింది కొత్తపుంతలు తొక్కుతున్న అమెరికా - భారత్ సంబంధాల గురించి. ఇటీవలకాలంలో భారత్‌కు అమెరికా అత్యంత ఎక్కువ ప్రాధాన్యతనిస్తోంది. ఎన్ఎస్‌జితో పాటు భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించే విషయంలో సైతం అండగా నిలుస్తోంది. భారత్‌తో వాణిజ్య, సైనిక సంబంధాల బలోపేతానికి చొరవ చూపుతోంది. దీనికి కారణం ఆ దేశ అధ్యక్షుడు ఒబామాకు భారత్ పట్ల వున్న సానుకూల వైఖరి కావచ్చు. అంతేకాదు, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్ అన్న దృష్టితో కూడా అయ్యుండొచ్చు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హయాం నుండి రష్యాకు సన్నిహిత దేశంగా భారత్‌పై ముద్రపడింది. దానివలనే అమెరికా మనల్ని చిన్నచూపు చూస్తూ వచ్చింది. ఆ కారణంతోనే పాకిస్థాన్‌ను మనకు పక్కలో బల్లెంలా చేసి పెట్టింది. పాకిస్థాన్‌కు స్వీయ సామర్థ్యం లేకున్నా ఆయుధాలను, ఆర్థిక అవసరాలను అన్నీ అమెరికానే సమకూర్చి పెడుతూ వచ్చింది. పాతికేళ్ల క్రితం సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యే వరకు కూడా మన దేశం పట్ల అమెరికా వైఖరి ఇలాగే కొనసాగింది. ఆసియా ఖండంలో భారత్‌ను తన శత్రువుగా, పాకిస్థాన్‌ను నమ్మకమైన నేస్తంగా భావిస్తూ వచ్చింది.

1999లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రధాని వాజ్‌పేయి అమెరికాతో మూసుకుపోయిన దారులను తెరిపించాడు. అమెరికా అధ్యక్షుడుగా బిల్‌క్లింటన్, భారత్ ప్రధాని వాజ్‌పేయిలు ఇరు దేశాల మధ్య సత్సంబంధాలను నెలకొల్పారు. అప్పుడే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే విషయంలోనూ పాకిస్థాన్‌ను అమెరికా తీవ్రంగా మందలించింది. వాజ్‌పేయి తర్వాత వచ్చిన మన్మోహన్‌సింగ్, అమెరికా అధ్యక్షుడిగా వచ్చిన జార్జిబుష్‌లు కూడా ఇరు దేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లారు. అయితే జార్జిబుష్ భారత్‌కు ఓ పక్క ప్రాధాన్యతనిస్తూనే మరోపక్క పాకిస్థాన్‌తోనూ సత్సంబంధాలు కొనసాగించాడు. ఒబామా వద్దకు వచ్చేసరికి భారత్ ప్రాధాన్యత పెరిగిపోయింది. అదే సమయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ కూడా అంతర్జాతీయంగా పెరిగి పోతున్న ఉగ్రవాదాన్ని అంతం చేసే క్రమంలో అమెరికా అవసరాన్ని గుర్తించి ఆ దేశంతో సంబంధాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చాడు.

## ఈ నేస్తం... నమ్మకమేనా?



ఆసియా ఖండంలోనే రెండు బలమైన దేశాలుగా చైనా, భారత్‌లు ఉన్నాయి. ఆర్థిక, రక్షణ, వాణిజ్య, సాంకేతిక రంగాలలో ఈరోజు అమెరికాను తలదన్నే స్థాయికి చైనా ఎదిగింది. ప్రపంచ అగ్రరాజ్యంగా చైనా తనకు పోటీ కాకుండా అడ్డుకోవాలంటే ఆసియా ఖండంలోనే ఆ దేశానికి పోటీ ఉండాలి. ఇందుకు భారత్ సరైన దేశమని గుర్తించింది. ఇటీవలకాలంలో భారత్ వృద్ధిరేటు కూడా చైనాతో పోటీ పడుతుండడాన్ని గుర్తించిన అమెరికా, ఈ దిశలో భారత్‌కు మరింత సహకారం అందించాలని సంకల్పించింది.

మనవైపు నుండి కంటే అమెరికా వైపు నుండే మనతో సత్సంబంధాలను ఎక్కువగా కోరుకుంటున్నారు. ఆసియా ఖండంలోనే రెండు బలమైన దేశాలుగా చైనా, భారత్‌లు ఉన్నాయి. ఆర్థిక, రక్షణ, వాణిజ్య, సాంకేతిక రంగాలలో ఈరోజు అమెరికాను తలదన్నే స్థాయికి చైనా ఎదిగింది. ప్రపంచ అగ్రరాజ్యంగా చైనా తనకు పోటీ కాకుండా అడ్డుకోవాలంటే ఆసియా ఖండంలోనే ఆ దేశానికి పోటీ ఉండాలి. ఇందుకు భారత్ సరైన దేశమని గుర్తించింది. ఇటీవలకాలంలో భారత్ వృద్ధిరేటు కూడా చైనాతో పోటీ పడుతుండడాన్ని గుర్తించిన అమెరికా, ఈ దిశలో భారత్‌కు మరింత సహకారం అందించాలని సంకల్పించింది. తాను నమ్ముకున్న పాకిస్థాన్ ఇప్పటికే చైనాకు చేరువైంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో చైనా సైనిక వ్యవహారాలు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. భారత్ పట్ల వ్యతిరేకతతో చైనా, పాకిస్థాన్‌లు కలిసాయి. కాబట్టి ఆసియాలో ఈ రెండు దేశాలను ఢీకొట్టాలంటే భారత్‌కు మద్దతుగా నిలవాలి. ఆసియాలో బలమైన మిత్రునిగా భారత్‌ను ఏర్పరచుకోవాలన్న లక్ష్యంతోనే అమెరికా మన పట్ల అసాధారణ ప్రేమాభిమానాలు చూపుతోంది.

మనకు కూడా అమెరికాతో స్నేహం చేయడం తప్ప విబేధించాల్సిన అవసరం లేదు. మనకు వివాదాలన్నీ చైనా, పాక్‌లతోనే. ఎప్పుడన్నా సమస్య వచ్చినా వారితోనే! వివాదాలు ఉన్నంతకాలం వాటితో సత్సంబంధాలు కష్టమే! కాబట్టి మనం అమెరికాను నమ్మి ముందుకు పోక తప్పదు.

# అంతరాష్ట్ర దోపిడీ దొంగల అరెస్ట్

## - రూ.30లక్షలు విలువగల సొత్తు స్వాధీనం



వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ
దొంగల నుండి స్వాధీనం చేసుకున్న కార్లు, మోటార్లు

నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ ఆదేశాల ప్రకారం అడిషనల్ డిఎస్పీ శరత్‌బాబు సూచనల మేరకు సిసిఎస్ డిఎస్పీ పి.శ్రీధర్ పర్యవేక్షణలో కావలి రూరల్ సిఐ అశోక్‌వర్ధన్, సిసిఎస్ సిఐలు రామకృష్ణారెడ్డి, ఎస్‌కె బాజీజాన్‌సైదా, సిసిఎస్ క్రైం సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి నెల్లూరుజిల్లా పరిధిలో, ఇతర జిల్లాల్లో హత్యలు, దారి దోపిడీలు, ఇండ్ల నేరాలు, చైన్‌స్నాచింగ్‌లు, వ్యవసాయ మోటార్లు దొంగలించుకుని జల్సాలు చేస్తూ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని తిరుగుతున్న 8మంది సభ్యులు గల గ్యాంగ్‌ను సోమవారం నెల్లూరు నేషనల్ హైవేలోని శ్రీహరి దాబా వద్ద పట్టుకుని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగలించిన సుమారు రూ.30లక్షలు విలువగల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ దర్గామిట్ట పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ హాల్లో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. నెల్లూరుజిల్లాకు చెందిన 8మంది అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 20కేసుల్లో దాదాపు రూ.30లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 30సవర్ల బంగారు, 1.50కిలోల వెండి వస్తువులు, ఆరు వ్యవసాయ మోటార్లు, రెండు కార్లు, టి.వి, ల్యాప్‌టాప్, ఇన్వర్టర్ బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు షేక్‌షవుల్లా, పాముల శేఖర్ అలియాస్ తమిళ్, ఎస్.కె.గౌస్‌బాషా, గంధవళ్ళ బాలాజీ అలియాస్ బాలు, అత్తిపాటి వెంకటరమణ అలియాస్ డిష్ రమణయ్య, ఎస్‌కె అబిద్, ఎస్‌కె నూరుల్లా, ఎస్‌కె ఇస్మాయిల్‌లు బృందంగా ఏర్పడి పలు నేరాలు, చోరీలు, హత్యలు చేసి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నారు. ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడంలో విశేష ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందించారు.

## కామాక్షితాయి హుండీ ఆదాయం రూ.8.36లక్షలు

జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాల హుండీని లెక్కించారు. హుండీ ద్వారా రూ.8,36,563లు ఆదాయం లభించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ఇసుక ట్రాక్టర్లతో ఇబ్బంది

నెల్లూరు, జొన్నవాడల మధ్య వందల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. ఇసుక మీద కనీసం పట్టలు కూడా కప్పడం లేదు. ద్విచక్రవాహనాలలో వెళ్లే వాళ్ళు గాలికి ఇసుక కళ్లల్లో పడి నానా ఇబ్బందులు పడుతున్నారు. అదీగాక ట్రాక్టర్లు విపరీత వేగంతో పోతున్నాయి. ఇరుకళల పరమేశ్వరీ దేవాలయం వద్ద రోడ్ల మీద కొచ్చి పిల్లలు ఆడుకుంటున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశముంది. పోలీసు మొబైల్ వ్యాన్ ఒకటి ఏర్పాటు చేయడం మంచిది.

*సి. హెచ్. గంగాధర్*, నెల్లూరు.

## సంస్కారం మరువొద్దు

మనుషులు మాట్లాడుకోవడానికైనా, ఒకర్నొకరు విమర్శించుకోవడానికైనా సంస్కారవంతమైన ఎన్నో భాషలు అందుబాటులో ఉన్నాయి. చక్కగా ఆ భాషలను వాడుకోవచ్చు. వాగ్దానాలను అమలు చేయకుంటే పాలకులను చెప్పులతో కొట్టండంటూ ప్రతిపక్షనేతగా జగన్ అనకూడదు. తీవ్రస్థాయిలో విమర్శలు చేయడానికి కూడా ఒక భాష, పదాలుంటాయి. అలాగే తెలుగుదేశం నాయకులు కూడా జగన్‌పై గతంలో సంస్కార హీనమైన భాషతో విమర్శలు చేశారు. ఆ భాష కూడా మంచిదికాదు. నాయకులందరు కూడా సంస్కారవంతులై ప్రవర్తిస్తే బాగుంటుంది.

*ముత్యాల సుహాసిని*, నెల్లూరు.

## మంత్రికి తగదు

శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూముల్లోని టేకు చెట్లను నరికేసి దుంగలను అమ్ముకున్న నిందితులకు మంత్రి నారాయణ కొమ్ము కాయడం తగదు. మంత్రే ఇలా వ్యవహరిస్తే ఇక ప్రభుత్వ ఆస్తులను కాపాడేవారు. దొంగలు, దోపిడీదారులు, అరాచకశక్తులను కాపాడుకోవడానికేనా మిమ్మల్ని మంత్రిని చేసింది? అక్రమార్కులకు అండగా నిలిచే ఇలాంటి వాళ్లు మంత్రి పదవులకు అనర్హులు.


*వి. శశి*, నెల్లూరు.



## నారసింహుడి సొమ్ము దోచిన వాళ్ళపై...

# నారాయణుడి దయ!

- పోలీసులకు చిక్కినా... రాజకీయ రక్షణ
- కేసును నీరుగార్చే ప్రయత్నాల్లో నేతలు



నెల్లూరురూరల్ మండలం నరసింహాపురంలోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంకు సంబంధించిన భూముల్లో అక్రమంగా టేకు చెట్లను నరికేసి అమ్మిన కేసులో పరారీలో వున్న నిందితుడు, తెలుగుదేశం నాయకుడు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేయగలిగారు. ఈ కేసులో మరో నిందితుడు అతని కొడుకు వేమిరెడ్డి హరిశివారెడ్డి పోలీసుల కళ్లు గప్పి కోర్టులో లొంగిపోయి బెయిల్ కూడా తెచ్చుకోవడం జరిగింది. ఏప్రిల్‌లో ఈ సంఘటన జరిగింది. దేవస్థానంకు చెందిన 30.12 ఎకరాల భూముల్లో 294 టేకు చెట్లను, 25వేప, 10కొబ్బరి చెట్లను నరికి అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ అక్రమ వ్యవహారానికి అప్పుడు తహశీల్దార్‌గా వున్న జనార్ధన్‌రావు సహకరించి ఎన్‌ఓసి జారీ చేయడం తెలిసిందే! ఈ కేసులో జనార్ధన్‌రావు సస్పెండ్ కావడం, ఆయనపై నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు కావడం, జైలుకు పోయి కండీషన్ బెయిల్ మీద బయటకు రావడం జరిగింది. జనార్ధన్‌రావు వారానికి రెండు రోజులు నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌కు పోయి సంతకం పెట్టి వస్తున్నాడు. ఈ కేసులో మరో నిందితుడైన వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి పరారయ్యాడు. గత నెలలో కర్నూలుజిల్లా బ్రహ్మంగారి మఠం వద్ద పోలీసుల నుండి కొద్దిలో తప్పించుకున్నాడు. ఆయన తిరుగుతున్న కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెలంతా ఆయన పలుచోట్ల ఆశ్రయం పొందాడు. ఈ కేసులో వేమిరెడ్డి హంసను ఎలాగైనా పట్టుకుని తీరాలని పంతం పట్టిన ఎస్పీ విశాల్‌గున్నీ ఇందుకోసం కేవలం రూరల్ పోలీసులనే నమ్ముకోకుండా మరికొన్ని టీమ్‌లను ఏర్పాటు చేశాడు. ఎట్టకేలకు హైదరాబాద్‌లో నెల్లూరుజిల్లాకు చెందిన మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి కుమార్తె ఇంటిలో ఆశ్రయం పొందిన హంసకుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసి నెల్లూరుకు తీసుకొచ్చారు. హంస పట్టుబడితే చించి ఆరేయాలని, ఇంటరాగేషన్ చేయాలని, ప్రెస్‌మీట్ పెట్టి హంసను చూపించి తమ ఘనతను చాటుకోవాలనుకున్నారు పోలీసులు.

**డామిట్ కథ అడ్డం తిరిగింది:**

హంసను అరెస్ట్ చేసారని తెలియగానే ఆయన బంధువర్గ రాజకీయ పక్షులు అలర్ట్ అయ్యాయి. ముఖ్యంగా మాజీ మంత్రి టి.రమేష్‌రెడ్డి, ఆయన సతీమణి, మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ అనూరాధలు మంత్రి నారాయణను కలిసారు. హంసకుమార్‌రెడ్డిని ఎలాగైనా కాపాడమని, కేసును నీరుగార్చాలని మంత్రిని కోరారు. మంత్రి కూడా మెత్తబడ్డాడు. వెంటనే కార్పొరేషన్ ఆఫీసుకు ఎస్పీ విశాల్‌గున్నీని పిలిపించుకున్నారు. హంసకుమార్‌రెడ్డి కేసును సీరియస్‌గా తీసుకోవద్దని, బలహీన పరచమని చెప్పినట్లు తెలుస్తోంది. మంత్రి చెప్పడంతో ఎస్పీ కూడా నీరుగారిపోయాడు. సైకిళ్లు, బైక్‌ల దొంగలను కూడా పోలీసులు ప్రెస్‌మీట్‌లు పెట్టి చూపించిన సందర్భాలున్నాయి. అలాంటిది జిల్లాలోనే సంచలనం రేపిన కేసులో నిందితుడిని పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా కోర్టులో ప్రవేశపెట్టారు. ఆరోగ్య కారణాలతో వెంటనే పెద్దాసుపత్రిలో జాయిన్ చేశారు. ఆసుపత్రిలో ఖైదీల వార్డు దగ్గర వుండే సిబ్బంది పచ్చనోట్ల పండుగ చేసుకున్నారు. మంత్రి నారాయణ ఎస్పీకి కేసును నీరుగార్చమని సూచించి, మీడియాకు మాత్రం 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అన్న రీతిలో ఫోజిచ్చి మాట్లాడడం విశేషం.


ఈ రాష్ట్రంలో అమాయక జనానికంటే కూడా దొంగలకు, స్మగ్లర్లకు, అక్రమార్కులకే రక్షణ ఎక్కువ ఉందనడానికి ఈ సంఘటన ఓ ఉదాహరణ. ఆడ పిల్లలను వేధిస్తున్నారని, తాగుబోతులు గొడవలు చేస్తున్నారని బాధితులు చెప్పుకుంటే వారికి అండగా ఏ రాజకీయ నాయకుడూ రాడు. కాని దేవుడికే శఠగోపం పెట్టిన ఓ అక్రమార్కుడిని రక్షించేందుకు ఎంతమంది తాపత్రయం పడుతున్నారో చూడండి. ఒకరు బాధ్యతాయుతమైన మంత్రి... ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడుతానని ప్రమాణం చేసిన వ్యక్తి. అలాంటి వ్యక్తి ఓ దౌర్భాగ్యపు కేసులో అక్రమాల వైపు నిలవడమేంటి? ఇక రమేష్‌రెడ్డి, అనూరాధలిద్దరు కూడా అత్యున్నత బాధ్యతాయుత పదవులు నిర్వహించినవాళ్లే! జిల్లాలోనే సంచలనం రేపిన కేసులోని ముద్దాయిని తమ ఇళ్లలో పెట్టుకుని కాపాడడమేంటి? ఇంతకంటే సిగ్గుమాలినతనం ఇంకొకటి ఉంటుందా?

**తప్పించుకున్న ఆదాల:**

ఈ సంఘటనకు కొద్ది రోజుల ముందే హంసకుమార్‌రెడ్డి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశంలో చేరాడు. దీంతో ఆదాల కొంత ఇబ్బంది పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినా ఆయన హంసకు మద్దతుగా నిలిచి గబ్బు పట్టేకంటే, ఆ కంపును కడుక్కోవడమే మేలనుకుని, పార్టీలోకి వస్తానంటే రమ్మన్నానే గాని, ఆయన అక్రమాలతో నాకెలాంటి సంబంధం లేదని ప్రెస్‌మీట్ పెట్టిమరీ తేల్చిచెప్పాడు.

**పోరాడిన నేతలు:**

వేదగిరి లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం భూముల్లో టేకు చెట్ల నరికివేత వ్యవహారంపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ వైకాపా నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డితో పాటు, అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా తీవ్రంగానే స్పందించారు. రాజకీయాలను పక్కనపెట్టి నిందితులకు శిక్షపడేలా చేయాలంటూ పోరాడారు.

# నెల్లూరు కబుర్లు

## రాజధానికి నెల్లూరు కూలీలు

అమరావతి రాజధాని పరిధిలోని వెలగపూడిలో నిర్మిస్తున్న రాజధాని తాత్కాలిక భవనాల నిర్మాణం కోసం నెల్లూరు నుండి దాదాపు 200మంది కూలీలు ఈ నెల 7వ తేదీన వెళ్లారు. వీళ్లంతా కూడా నారాయణ విద్యాసంస్థల నిర్మాణాలలో పనిచేస్తున్న వాళ్లే! తాత్కాలిక భవనాల నిర్మాణ పనులను త్వరగా ముగించేందుకు ప్రతి ఎమ్మెల్యే వందమంది భవన నిర్మాణ కార్మికులను పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.

## ఒక యంత్రం... రెండు ఓపెనింగ్‌లు



చీపురుకట్టలతో కాకుండా మెషిన్ చీపురుకట్టలతో నెల్లూరురోడ్లను శుభ్ర పరచాలని మేయర్ అజీజ్ సంకల్పించాడు. ఈ నేపథ్యంలో వాక్యూమ్ రోడ్ క్లీనర్ పేరుతో వచ్చిన ఈ చీపురుకట్ట యంత్రాన్ని ఇటీవల వనంతోపు సెంటర్‌లో మేయర్ లేకుండానే మంత్రి నారాయణ ప్రారంభించారు. ఇది అజీజ్‌కు కడుపు మండించింది. ఈ నెల 3న గాంధీబొమ్మ సెంటర్‌లో మేయర్ అజీజ్ అదే చీపురుకట్టల మిషన్‌ను మరోసారి ప్రారంభించాడు. దీనిపై అదేరోజు మంత్రి నారాయణ ఘాటుగా స్పందించాడు. మేయర్ ఇంతే... అప్పుడప్పుడు ఇలాంటి తలకాయలేని పనులు చేస్తుంటాడన్నట్లు మంత్రి వ్యాఖ్యానించడం విశేషం.

## పిచ్చి తుగ్లక్‌ను తలపిస్తున్నారు

— కర్నాటి ఆంజనేయరెడ్డి



రాష్ట్రంలో చంద్రబాబు పాలన తుగ్లక్‌ను తలిపించేలా వుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ఆరోపించాడు. 7వ తేదీ ఆయన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపి సచివాలయ ఉద్యోగులను హైదరాబాద్ నుండి అమరావతికి తరలించే ప్రక్రియ తుగ్లక్ చేష్టలను గుర్తు చేస్తుందన్నారు. ఉద్యోగుల తరలింపుపై ఇంతవరకు రోడ్‌మ్యాప్ సిద్ధం చేయలేదు. తాత్కాలిక సచివాలయం నిర్మాణ పనులు పూర్తి కాలేదు, మౌలిక సదుపాయాలు లేవు. వీటి మీద స్పష్టత లేదు. ప్రభుత్వంతో పాటు ఉద్యోగ సంఘాల నేతలు కూడా ఉద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నారు. అమరావతికి తరలిరాని ఉద్యోగులను తొలగించాలని ఎమ్మెల్సీ బాబూరాజేంద్రప్రసాద్ చెప్పడం విడ్డూరంగా వుంది. సచివాలయాన్ని అమరావతికి తరలించడం మంచిదేనని, దానిని ఒక క్రమపద్ధతిలో చేయాలేగాని ఇలా ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా కాదని ఆంజనేయరెడ్డి పేర్కొన్నాడు. ఈ నెల 16న నెల్లూరులో జరిగే పార్టీ రెండేళ్ల పాలనా విజయోత్సవ సభకు కేంద్ర రక్షణ మంత్రి మనోహర్ పారికర్ వస్తున్నారని, ఈ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఈ దీక్షలు పెద్ద దగా!

పెరిగిన ధరలు, తన ప్రభుత్వ అవినీతి అక్రమాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నవనిర్మాణ దీక్షల పేరుతో నాటకాలేస్తున్నాడని పీసీసీ ఉపాధ్యక్షుడు శైలజానాథ్ విమర్శించాడు. ఈ నెల 5వ తేదీన నెల్లూరు ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు కరువుతో అల్లాడుతుంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ఈ దీక్షలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించాడు. ఈ దీక్షల పేరుతో అధికారులను పని చేయనీయకుండా చేస్తున్నారని విమర్శించాడు. తెలుగుదేశం వల్లే తెలంగాణ వచ్చిందని వరంగల్‌లో చెప్పిన చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసరికి మాత్రం కాంగ్రెస్ వల్లే రాష్ట్ర విభజన జరిగిందని దొంగ ఏడుపు ఏడవడం విచిత్రంగా ఉందన్నారు. ఓటు-నోటు కేసుకు భయపడి తెలంగాణ ప్రభుత్వం కడుతున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోలేకపోతున్నాడు. కేంద్రాన్ని ప్రత్యేకహోదా, నిధులు అడగాలంటే వణికి పోతున్నాడు. గెస్ట్‌హౌస్‌లు, విమానాలు, ఇళ్లు, ఆర్భాటాలకు మాత్రం చంద్రబాబు 3వేల కోట్ల ప్రజాధనాన్ని తగలేసాడని ఆయన దుయ్యబట్టారు. ఈ సమావేశంలో పీసీసీ సమన్వయ కమిటి సభ్యులు సి.వి.శేషారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పి.చెంచలబాబుయాదవ్, ఉడతా వెంకట్రావ్, రఘురాం ముదిరాజ్, శివాచారి, బాలకృష్ణ, శ్రీనివాసులు, అల్లావుద్దీన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు.. కూల్ కూల్

రోహిణికార్తె గండం నుండి గట్టెక్కినట్లే! మేను దాటుకుని జూన్‌లోకి ప్రవేశించాం. ఎండలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. ఉష్ణోగ్రతలు తగ్గాయి. కాకపోతే ఉక్కపోత ఉంటుంది. సాయంత్రమైతే మబ్బులు పట్టి, మెరుపులు, ఉరుములతో కూడిన జల్లులు పడుతున్నాయి. ఇవి బాగానే ఉపశమనం కలిగిస్తున్నాయి. వాతావరణం కొంత చల్లబడడంతో ప్రజలు తెరిపినపడుతున్నారు.

## కరెంటోళ్ల మీద కేసు

ఈ నెల 4వ తేదీ ట్రాన్స్‌కో సిబ్బంది నెల్లూరులోని బోసుబొమ్మ వద్దగల సిసిఎస్‌లో లైన్లకు అడ్డంగా ఉన్నాయని చెప్పి రెండు పెద్ద చెట్లను నరికారు. సిసిఎస్ సిబ్బంది ఈ చెట్లను ప్రేమగా చూసుకునే వాళ్లు. ఆటవిడుపుగా ఈ చెట్ల క్రింద నిలబడి మాట్లాడుకుంటుండేవాళ్లు. నిలువునా చెట్లను కూల్చేయడంతో కోపమొచ్చిన వాళ్లు మూడోనగర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యుత్ శాఖ ఏడి, లైన్‌మెన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### క్యాన్సర్ హాస్పిటల్‌కు

## లక్ష విరాళం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి క్యాన్సర్ ఆసుపత్రికి సోమవారం పణతల వెంకటసుబ్రహ్మణ్యం దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత వెంకటసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్యాన్సర్ హాస్పిటల్‌లో పేద ప్రజలకు అందుతున్న సేవల పట్ల సంతృప్తి చెంది విరాళాన్ని క్యాన్సర్ రోగుల వైద్య సహాయార్థం వినియోగించాలని సూచించారు.

## జడ్పీలో హాజరు యంత్రం

నెల్లూరులోని జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల హాజరు కోసం బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు ఎన్ని గంటలకొచ్చారు. ఎన్ని గంటలకు పోయారు, ఏరోజు వచ్చారు, ఏరోజు ఎగ్గొట్టారనేదంతా ఈ మిషన్లలో రికార్డవుతుంది. జిల్లా వ్యాప్తంగా 46 మండల కార్యాలయాల్లోనూ, జడ్పీకి సంబంధించిన ప్రధాన కార్యాలయాలలోనూ వీటిని ఏర్పాటు చేశారు.

## జడ్పీ సమావేశం

నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీ ఉదయం 10.30గంటల నుండి జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజాపరిషత్ సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

### హింసపురి...

## వేళలు మారనున్నాయి



అందరూ ప్రేమగా హింసపురి ఎక్స్‌ప్రెస్ అని పిలుచుకునే సింహపురి ఎక్స్‌ప్రెస్ బయలుదేరే వేళలను మార్చనున్నట్లు సోమవారం నెల్లూరొచ్చిన రైల్వే జోనల్ మేనేజర్ రవీంద్ర గుప్తా సంకేతాలిచ్చారు. ఈ రైలు ఇప్పుడు గూడూరులో రాత్రి 9.45గంటలకు బయలుదేరుతుంది. ఉదయం హైదరాబాద్‌కు వెళ్ళేసరికి పదిపైనే అవుతుంది. అలాగే హైదరాబాద్‌లోనూ రాత్రి 11గంటలకు బయలుదేరి ఉదయం 8.30గంటలకు నెల్లూరుకు చేరుకుంటుంది. ఈ రైలు వేళలను మార్చాలని నెల్లూరు వాళ్లు ఎప్పట్నుండో కోరుతున్నారు. ఈమేరకు సాయంత్రం 6గంటలకు గూడూరులో బయలుదేరేటట్లు చేస్తారంట. 6.45గంటలకు నెల్లూరు చేరుకుంటుంది. హైదరాబాద్ నుండి కూడా ఇదే టైంకు బయలుదేరేలా వేళలు మార్చే ప్రక్రియ జరుగుతోందట! అతివృష్టి అనావృష్టి అంటే ఇదే! పెడితే రాత్రి 11గంటలకు పెడతారు, లేదంటే ఎవరికీ కొరగాని 6గంటలకు పెడతామంటారు. అందరూ పనులు ముగించుకుని ప్రశాంతంగా బయలుదేరే 8 నుండి 9గంటల మధ్య కాలాన్ని వీళ్లు గుర్తించరా?

## అపోలోలో తలనొప్పి క్లినిక్



వివరాలను తెలియజేస్తున్న డా॥ బిందుమీనన్

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో స్పెషల్ హెడ్‌ఏక్ క్లినిక్‌ను ఈ నెల 4న హెడ్ ఆఫ్ న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ బిందుమీనన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలనొప్పి నరాలకు సంబంధించిన వ్యాధని, తలనొప్పులలో 250కిపైగా రకాలున్నాయన్నారు. తలనొప్పిని ప్రైమరీ మరియు సెకండరీ భాగాలుగా చేయొచ్చని, తలనొప్పికి ప్రారంభ దశలోనే చికిత్స చేయించుకోకుంటే, ఇది దీర్ఘకాల జబ్బుగా మారి శాశ్వతంగా మందులు వాడాల్సివస్తుందన్నారు. తలనొప్పి క్లినిక్ ప్రతి గురువారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. అన్ని రకాల తలనొప్పులు చూస్తామని ఒకే చోట రోగ నిర్ధారణ, కౌన్సిలింగ్, చికిత్స ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అపోలో వైద్యులు శ్వేతారెడ్డి, రవి, గాయత్రి, ఉష, శాలిని, నవీన్ పాల్గొన్నారు.

## ఆనం వెంకటరెడ్డికి నివాళులు



వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న ఆనం రంగమయూర్‌రెడ్డి

స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి 21వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు రామలింగాపురం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి సోమవారం ఆయన కుమారుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఆనం జయకుమార్‌రెడ్డి, మనుమడు కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చాట్ల నరశింహరావు, హరిబాబుయాదవ్, ఖాజావలి, శేషుయాదవ్, కోటేశ్వరరెడ్డి, కిన్నెరప్రసాద్, గాదంశెట్టి గోపి, శశిధర్, షమీమ్, సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెనకా రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో సింగం



హీరో సూర్యతో ఎమ్మెల్యే అనిల్, కార్పొరేటర్ రూప్‌కుమార్

తమిళనాడులో మంచి క్రేజ్ వున్న హీరో సూర్య నటిస్తున్న 'సింగం-3' సినిమా షూటింగ్ మూడు రోజుల పాటు నెల్లూరులో జరిగింది. మాగుంట లేఅవుట్, చిల్డ్రన్స్‌పార్క్, కె.వి.ఆర్.పెట్రోల్ బంకు సెంటర్ లలో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. పగలైతే జనం గుమికూడతారని, ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంటుందని భావించి, అర్ధరాత్రిళ్లే ఎక్కువగా షూటింగ్ జరిపారు. హీరో సూర్య జిల్లా ఎస్పీ బంగ్లా కెళ్లి ఎస్పీ విశాల్‌గున్నీని మర్యాదపూర్వకంగా కలిసారు. అలాగే హోటల్ మినర్వలో బస చేసిన హీరో సూర్యను నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేషన్ వైసిపి ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, డిఎస్పీ జె.వి.రాముడు తదితరులు కలిసి ఫోటోలు దిగారు.

## రంగనాయకి అమ్మవారికి బంగారుచీర

నెల్లూరు రంగనాయకులపేట పినాకిని నదీ తీరాన వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కొలువైన రంగనాయకి అమ్మవారికి నెల్లూరు నగరానికి చెందిన బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, స్నేహలతారెడ్డి దంపతులు ఆదివారం రూ.5.25 లక్షలు విలువచేసే బంగారు చీరను బహుకరించారు. అలాగే దేవస్థానానికి రూ.4.75 లక్షలు విలువైన జనరేటర్‌ను అందజేసినట్లు ఇ.ఓ పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# బాలు పాట... పరిమళాల పూదోట

## ఉత్సాహ వాతావరణంలో ఎస్పీ బాలు జన్మదిన వేడుకలు

భారతదేశం ప్రతిష్టను ఇనుమడింప జేసే స్థాయికి ఎదిగిన గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నెల్లూరీయుడు కావడం మనందరికి గర్వకారణమని ప్రముఖ సినీ గీతరచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరులో శ్రీ విజేత ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 71వ జన్మదిన వేడుకలను ఈ నెల 4వ తేదీ రాత్రి నెల్లూరు టౌన్‌హాలు ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజేత ఆర్ట్స్ అధ్యక్షుడు వెన్నెలకంటి మాట్లాడుతూ బాలు నాటకరంగ కళాకారుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. బాలు ప్రాణమిత్రుడు యజ్ఞావఝుల కామేశ్వరరావుతో కలిసి విజేత ఆర్ట్స్‌ను స్థాపించి నటుడుగా ఎన్నో నాటకాల్లో నటించి ఉత్తమ నటుడుగా అవార్డులు అందుకున్నాడని తెలిపారు. మిత్రుడు కామేశ్వరరావు మరణానంతరం 14ఏళ్ళుగా విజేత ఆర్ట్స్ ఆధ్వర్యంలో వై.కామేశ్వరరావు మెమోరియల్ నాటక కళాపరిషత్‌ను నిర్వహించి నెల్లూరీయుల అభిమానాన్ని చూరగొన్నామన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల నాలుగేళ్ళుగా సంస్థ కార్యక్రమాల నిర్వహణకు అంతరాయం కలిగిందన్నారు. సింహం ఒక అడుగు వెనకేసిందంటే పది అడుగులు ముందుకేస్తుందని, ఆ రీతిన సంస్థను ఈ ఏడాది నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి బాలు జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి పురస్కారాన్ని అందిస్తామన్నారు. ప్రతి ఏడాది జరిగే జాతీయస్థాయి పురస్కార వేడుకలను బాలు స్వయంగా పర్యవేక్షిస్తారన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ప్రత్యేకంగా తయారు చేయించిన బాలు బర్త్‌డే కేక్‌ను కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. తొలుత రాజమండ్రికి చెందిన లలితా సింధూరి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. స్వరవిన్యాసం కార్యక్రమంలో పాడుతా తీయగా గాయనీగాయకులు విష్ణుప్రియ, జగద్ధాత్రి, ప్రమోద్ కుమార్, మమన్ కుమార్, స్వాతి, ప్రియ, వంశీ, నాగార్జునలు ఆలపించిన సుమధుర గీతాలు మైమరపించాయి. వీరందరికీ ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు వాసురావు జ్ఞాపికలు బహుకరించారు.



## 'సంగీత విద్వన్మణి' వాసూరావు

బాలూ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సినీ సంగీత దిగ్గజం స్వర్గీయ సాలూరు రాజేశ్వరరావు పుత్రుడు, ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు వాసూదేవరావును శ్రీ విజేత ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వాసూరావు దంపతులను శాలువాతో గజమాలతో సత్కరించి 'సంగీత విద్వన్మణి' బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వాసూరావు మాట్లాడుతూ ఈ సత్కారం అందుకోవడం కన్నా బాలు ఆధ్వర్యంలో జరిగే పురస్కారాల ప్రదానోత్సవంలో భాగస్వామినై తనవంతు సేవ చేసే అవకాశం కల్పించడమే తనకు ఆనందదాయకంగా ఉంటుందన్నారు. వచ్చే ఏడాది నుంచి జరిగే జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో తానూ ఓ సభ్యునిగా పని చేస్తానన్నారు. శ్రీ విజేతా ఆర్ట్స్ ప్రధానకార్యదర్శి వై.శేషగిరీశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సినీ రచయిత రాజేంద్రకుమార్, మురళీకృష్ణ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వెల్లంచేటి చంద్రమౌళి, శ్రీ త్యాగరాజ భిక్షాటన పూర్వక స్మరణోత్సవసభ కార్యదర్శి డా॥ యనమండ్ర నాగదేవిప్రసాద్, రావి మోహన్‌చౌదరి, నిజాముద్దీన్, ఎం.సుబ్రహ్మణ్యం, వై.విశ్వనాథం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో కోల్డ్‌మేన్ లాజిస్టిక్స్



శ్రీసిటీలో బుధవారం కోల్డ్‌మేన్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ముంబైకు చెందిన ఈ కంపెనీ తమ మరో కొత్త యూనిట్‌ను ఇక్కడ నెలకొల్పనుంది. కంపెనీ ఉన్నతాధికారుల బృందం, పలువురు అతిథులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసిటీలో 5 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమలో అధునాతన గిడ్డంగి సదుపాయాలు కల్పించనున్నారు. ఉష్ణోగ్రతలను నియంత్రిస్తూ పనిచేసే పలు గిడ్డంగుల విభాగాలను ఇక్కడ ఏర్పాటు చేస్తారు. ఇందులో ఆహార పదార్థాలు, ఔషధాలు, కూరగాయలు, పండ్లు వంటి ఉత్పత్తులను నిల్వచేసి ఎగుమతులతో పాటు దేశీయ వినియోగానికి, ఇతర పరిశ్రమల ఉత్పత్తుల నిల్వలకు ఇది ఉపయోగపడుతుంది. 2017 ఏప్రిల్ నాటికి గిడ్డంగుల నిర్మాణం పూర్తి కానుంది. కంపెనీ డైరెక్టర్ దేవ్ ఆనంద్ పరిశ్రమ నిర్మాణానికి శ్రీసిటీ ఎంతో అనువైన ప్రాంతంగా పేర్కొన్నారు. మంచి మౌలిక వసతులు, ప్రధానరోడ్లు, పోర్టుల అనుసంధానం తమ వ్యాపారవృద్ధికి మరింత దోహదపడుతుందన్నారు. రెండేళ్ళలో దీనిని మరింత విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు.



# ఈ 35 ఏళ్ళు...

ఒక్కో ఏడాది 'లాయర్'కు ఒక్కో మైలురాయిగా నిలిచింది. గడిచిన అనుభవాలను..సాధించిన విజయాలను ఒకసారి విహంగావలోకనం చేసుకుంటే..ఎన్నెన్నో సాహసోపేత, సంచలనాత్మక విశ్లేషణాత్మక వార్తా విశేషాలను, జరిగిన-జరగబోతున్న రసవత్తరమైన రాజకీయ కథనాలను శరపరంపరగా పాఠకలోకానికి అందించింది. సమాజంలో పెచ్చుమీరి పోతున్న నేరాలు-ఘోరాలు.. దురాగతాలను తూర్పారబట్టింది. ఎన్నెన్నో వాస్తవ వార్తా కథనాలను దోసిళ్ళతో ఎత్తి.. రాశులుగా పోసింది. 1981లో తుంగా రాజగోపాలరెడ్డిగారి నేతృత్వంలో ప్రారంభమైన 'లాయర్' వారపత్రిక ఒక ఉద్యమస్ఫూర్తితో దూసుకువచ్చి.. అచిర కాలంలోనే ప్రజల ఆదరాభిమానాలకు పాత్రమైంది. నెల్లూరులో చరిత్రాత్మకమైన కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలో సినిమాలయాలు నిర్మించాలన్న ధనార్జనపరుల ప్రతిపాదనలకు, ప్రయత్నాలకు ఆదిలోనే అడ్డుకట్ట వేస్తూ..ప్రజల అండదండలతో.. తన కలం బలంతో లాయర్ అవిశ్రాంతంగా పోరాటం చేసింది. ఎందరో పెద్దలను సైతం ఎదిరించి.. ఆ బాలికల విద్యాలయాన్ని పరిరక్షించేందుకు సాహసోపేతమైన కథనాలు రాసింది. నేటికీ ఆ విద్యాలయం చదువులతల్లికి నిలయంగా భాసిల్లు తుందంటే అది ఆనాడు 'లాయర్' పత్రిక చేసిన నిర్విరామ కృషి అన్నది జగమెరిగిన సత్యం. ఆ ఘనత అంతా కూడా కలం యోధుడు..ఎవరికీ తలవంచని ధీరుడు..తుంగా రాజగోపాలరెడ్డిగారిదేనన్నది జగద్విదితం. నాటి నుంచి నేటి దాకా, రాజగోపాలరెడ్డిగారి తదనంతరం కూడా అదే ఉద్యమస్ఫూర్తితో, అదే పోరాటదీప్తితో మరిన్ని సాహసోపేత వార్తా కథనాలతో.. ప్రతిఏటా ఎన్నో విశేషాంశాలతో.. ప్రత్యేక సంచికలతో ప్రజల అభిమానాన్ని చూరగొంటోంది 'లాయర్'. ప్రజలకు నిత్యనూతన సమాచార వారధిగా నిలుస్తూ.. ప్రజాచైతన్యమే పరమావధిగా అడు గడుగునా అక్షర దీపాలు వెలిగిస్తూ.. స్థానిక వారపత్రికా రంగంలో అగ్రగామిగా వెలుగుతూ... ప్రజలందరి చల్లని దీవెనలతో మునుముందుకు సాగుతోంది 'లాయర్'.

- గుళ్ళూ గోపురాలను, దర్గాలను.. మసీదులను.. ప్రార్థనాలయాలను గుత్తంగా కాజేసే స్వాహాస్వాముల బండారాలెన్నిటినో బయటపెట్టింది.. 'లాయర్'. ఆత్మకూరు పోలేరమ్మ ఆస్తులను కబళిస్తున్నారనే ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని 'పోలేరమ్మ ఆస్తి 'పోతురాజు'ల పాలైందా?..అంటూ నిలదీసింది. పరమపవిత్రమైన పెంచలకోన క్షేత్రం అత్యాశపరులకు చిక్కి వ్యాపారాత్మకమైపోతున్నదని, చివరికి అక్కడి ధర్మకర్తలే అక్రమాలకు తెరతీస్తున్నారని 1985లో 'పవిత్ర పుణ్యక్షేత్రం..నేడు వ్యాపారకేంద్రం' అనే శీర్షికతో కథనాన్ని రాసి ప్రభుత్వం కళ్ళు తెరిపించింది.
- సోమశిల ప్రాజెక్టు పనుల్లో అప్పట్లో (1985) అడుగడుగునా జరుగుతున్న అవకతవకలను 'సోమశిల కుంభకోణం' పేరుతో విశ్లేషణాత్మకమైన వార్తాకథనం రాసి సంచలనం సృష్టించింది. 1986లో తెలుగుదేశం హయాంలో జరిగిన బస్సురూట్ల కుంభకోణాన్ని, అదేవిధంగా 1987లో బైరాగి మఠం కుంభకోణాన్ని వెలికితీసి మరో సంచలనం సృష్టించింది. 10లక్షలు విలువజేసే స్థలాన్ని కేవలం రెండు లక్షలకే అప్పనంగా ఇచ్చేసేందుకు జరిగిన యత్నాన్ని లోకానికి వెల్లడించి ప్రజలందరి ప్రశంసలందుకుంది.
- ఫోర్జరీ సంతకాలతో లక్షల రూపాయలు స్వాహాచేసేవారిని, దొంగ నోట్లు-బందిపోట్ల బండారాల్నీ, భూములు కబ్జా చేసేవారినీ, బంగారం పేరుతో నెత్తిన కుచ్చులటోపీ పెట్టేవారిని, సిమెంట్‌ను సైతం శుద్ధంగా ఆరగించేసేవారినీ, వరకట్న హత్యల్నీ, సమాజంలో అతివలపై జరుగుతున్న అన్యాయాల్నీ, దురాగతాల్నీ, దుర్నీతుల్నీ.. అన్నిటినీ నిలదీసింది 'లాయర్'.
- ఎన్నికల తాలూకు విరాళాల నల్లధనం నాచారంలోని చైతన్యరథం నుంచి మాయమైన విషయాన్నంతా కూపీలాగి నాచారం దొంగతనంపై 1990లో 'లాయర్' ప్రచురించిన విశ్లేషణాత్మక కథనం.. అప్పట్లో మరో సంచలనంగా నిలిచింది.
- కడుపారా సారా తాగి..మత్తులో జోగుతున్న మగరాయుళ్ళ మత్తుదిగేలా 1992లో జిల్లాలో మోగిన సారాపై సమరభేరికి మనసారా మద్దతు ఇస్తూ.. తనవంతు కలం పోరాటంతో ఆ ఉద్యమానికి ఉత్సాహాన్ని-ప్రోత్సాహాన్ని అందించి తద్వారా సమాజ సంస్కరణకు బాటలు వేసింది. సంసారాలను గాలికొదిలేసి తాగి, తందనాలాడుతున్నవారిని తట్టి లేపుతూ, సారాకు వ్యతిరేకంగా సింహపురిమహిళ కొదమసింహంలా కదంతొక్కిన వైనాన్ని 'లాయర్' విపులంగా వివరిస్తూ అప్పట్లో ఎన్నో కథనాలు ప్రచురించింది.
- కావలిలో 1993 ప్రాంతంలో జరిగిన భూ కుంభకోణాన్ని బయటపెట్టి, బినామీపేర్లతో ప్రభుత్వ భూములను ఆక్ర మించాలనుకున్నవారి గుట్టుమట్టులన్నీ బయటపెట్టింది.. 'లాయర్'.
- నెల్లూరులో అమెరికన్ ఆసుపత్రిని అమ్మేస్తున్నారని, గుమ్మిడిపూడిలో నకిలీ ఇంజెక్షన్లు తయారుచేస్తున్నారని..ఇలా ఎక్కడ ఎలాంటి అక్రమాలు జరుగుతున్నా సరే, కలాన్ని కత్తిలా ఝుళిపించి..నిజాల్ని నిర్భయంగా రాస్తూ ప్రజలను, ప్రభుత్వాల్ని మేల్కొలిపింది 'లాయర్'. ఒకప్పుడు వెయ్యిలోపు ర్యాంకు వుంటేనే వచ్చే ఇంజనీరింగ్ సీటు ఇప్పుడు 50వేల ర్యాంకు దాటినవారికి కూడా ఇచ్చేస్తున్నారని, అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబునాయుడు పాలనలో విద్యా విలువలు తగ్గిపోతున్నాయంటూ 2000వ సంవత్సరంలోనే ఆ అస్తవ్యస్త విద్యావిధానాల మీద అక్షరాస్త్రాలు సంధించింది.. 'లాయర్'. ఈ 35ఏళ్ళలో రకరకాల కుంభకోణాలెన్నిటినో బయటపెట్టి ప్రజలను అక్రమార్కుల నుంచి అప్రమత్తంగా వుండేలా చేసింది.
- అవినీతిపరుల గుండెల్లో దడపుట్టించే విధంగా, అక్రమార్కులకు సింహస్వప్నంగా, నేల నుంచి నింగిదాకా ఏది కనిపించినా మింగేయాలనుకునే స్వార్థపరుల ఆటలు కట్టిస్తూ..ప్రతి అక్షరం నిజాలకు దర్పణంగా వార్తాకథనాలు రాసింది. ప్రజలను బురిడీకొట్టించే మాయగాళ్ళకు పక్కలో బల్లెంగా వుంటూ, సమాజాన్ని పట్టిపీడించే స్వార్థపరుల మాయల్ని -వారి మాయాజాలాన్ని చీల్చి చెండాడుతూ.. నీతికి-నిజాయితీకి, నిష్పక్షపాతానికి-నిర్భీతికి ప్రతీకగా నిలుస్తూ, ప్రజల కోసం-న్యాయం కోసం-ధర్మపరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతోంది 'లాయర్' నాటికీ-నేటికీ- ఏనాటికైనా సరే..లాయర్ ప్రస్థానమంతా..శ్వాస-ధ్యాస అంతా ప్రజల క్షేమం కోసమే-సమాజ సంక్షేమం కోసమే. జిల్లాలో ఎన్నో అక్రమాలను, అవకతవకలను, అవినీతి కుంభకోణాల గుట్టును బయటేసింది 'లాయర్'. సమాజంలో అవినీతి కలుపుమొక్కలన్నిటినీ చేతనైనంతవరకు పీకిపారేయడానికే 'లాయర్' కలం పట్టింది. లాయర్ అంటే కుంభకోణాల పుట్టలు పగులగొట్టే పలుగురాయే తప్ప..ప్రలోభాలకు లొంగిపోయేది కాదు. పొగడ్తలకు పొంగిపోయేదీ కాదు..ఇటు విమర్శలకు కుంగిపోయేదీ అసలే కాదు. పుట్టి, బుద్దెరిగినప్పటినుంచీ 'లాయర్' ఏనాడూ కట్టుకథలు రాసింది లేదు. రాసిందల్లా అక్షరసత్యమే. ప్రతి అక్షరం ప్రజల పక్షమే. అంతే తప్ప, తప్పుడు రాతలకు, గాసిప్‌లకూ 'లాయర్'లో చోటుండదు. బ్లాక్‌మెయిలింగ్ వార్తలకు అసలే తావుండదు. అలాంటి అనైతిక రాతలకు 'లాయర్' బద్ధవిరోధి అనే విషయం అందరికీ తెలిసిందే. 'లాయర్'పై అభిమానంతో ప్రకటనకర్తలు ఇచ్చే అడ్వర్టయిజ్‌మెంట్లే పత్రికకు వెన్నుదన్ను. అంతే తప్ప, వార్తకు, వ్యాఖ్యకు వెల కట్టే అనైతిక సంస్కృతి 'లాయర్'కు లేదు! ఓ వారం 'అంతా అవకతవకలే' అని ప్రచురించి, వెనువెంటనే తదుపరి వారం అంతా బాగానే ఉందంటూ ఒకే విషయంపైన రెండు నాలుకల విధానం అవలంబించే దుష్ట సంప్రదాయం 'లాయర్'కు లేదు.




***35*** ఏళ్ళు.. అక్షరాలా ముప్పై అయిదు సంవత్సరాలు..ఈ అక్షరయజ్ఞం ఆరంభించి. ప్రజల తరపున వాదించే పత్రికగా 'లాయర్' వారపత్రిక ఆవిర్భవించి. ప్రజాస్వామ్యానికి మూలస్థంభాల్లో ఒకటైన పత్రికారంగంలో..ఎంతో చరిత్రాత్మకమైన సింహపురి నగరంలో ఒక చిన్న పత్రికగా తన ప్రస్థానం ప్రారంభించి..సరిగ్గా 35 ఏళ్ళు. ఈ సుదీర్ఘకాలంలో ఎన్నో ఆటుపోట్లు, ఎన్నెన్నో అవాంతరాలు. అయినా, 'లాయర్' ఏనాడూ అక్షరాలను అమ్ముకోలేదు. ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టుకోలేదు. నిజాల్ని నిష్పక్షపాతంగా, నిర్భీతిగా రాయడంలో 'లాయర్' ఏనాడూ ఎవరికీ తలవంచింది లేదు. లాయర్' పుట్టుకే ప్రజల క్షేమం కోసం.. 'లాయర్' జీవితమే ప్రజల కోసం. ప్రజాసమస్యల సాధనకు నిరంతరం పెన్నెత్తి పోరాడడమే 'లాయర్' నైజం. ప్రజలచేతిలో ఒక చైతన్యదీపికగా..ఒక అక్షరాయుధంగా నిలవడమే 'లాయర్' ఆవిర్భావ విశేషం. ఇది ప్రజలందరికీ తెలిసిన సత్యమే. ప్రజల గుండె చప్పుడుగా వుండే లాయర్..ఏనాడూ ఎలాంటి తాటాకు చప్పుళ్ళకు భయపడలేదు. ఎవరేమనుకున్నా సరే.. నిజాల్ని నిర్భయంగా చాటుతూ, ఎల్లవేళలా ప్రజాపక్షమే నిలుస్తూ..ప్రజల అండదండలతో ముందుకు సాగిపోయేదే..'లాయర్'. ఈ 35 ఏళ్ళలో 'లాయర్' స్థానిక వారపత్రికా రంగంలో ఎవరూ ఊహించనివిధంగా అనేక సంచలనాత్మక విజయాలను సాధించింది. ఎన్నో ప్రత్యేక సంచికలు, అనుబంధ సంచికలతో పాఠకులతో వున్న అనుబంధాన్ని మరింతగా పెంచుకుంది. అందుకు అడుగడుగునా.. ఇదిగో మేమున్నామంటూ చేయూతనందించి.. చెక్కుచెదరని ఆత్మీయతతో తమ అభిమానాన్ని, ఆశీస్సులను నాటికీ-నేటికీ నిరంతరం అందజేస్తున్న అశేష ప్రజానీకానికి.. పాఠకదేవుళ్ళకు, ప్రకటనకర్త లకు, అభిమానించే ప్రతిఒక్కరికీ.. ఈ సందర్భంగా 'లాయర్' హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.




# అక్షరదీపికలు.. అనుబంధ సంచికలు



'లాయర్' అనుబంధ సంచికల విశిష్టత చెప్పాల్సిన అవసరమే లేదు. రచనా వైదుష్యానికి, భాషాపటిమకు.. విశ్లేషణాత్మక-విమర్శనాత్మక కథనాలకే కాక.. అత్యంత నాణ్యమైన ముద్రణకు కూడా పెట్టింది పేరు..'లాయర్'. ఎక్కడా రాజీపడకుండా.. అత్యద్భుతమైన రీతిలో 'లాయర్' స్పెషల్స్ వుంటాయన్నది పాఠకలోకానికంతటికీ విదితమే. 'లాయర్' ఆవిర్భావం నుంచి అనుబంధ సంచికలు కూడా ఆవిర్భావించాయి. ఎంతో విశేషంగా.. విశిష్టంగా.. విలక్షణంగా వుండే ఈ ప్రత్యేక సంచికలు పాఠకలోకాన్ని ఎంతగానో ఆకట్టుకుంటూనే వున్నాయి. చిత్రపరిశ్రమతో సింహపురీయులకున్న అనుబంధాన్ని వివరిస్తూ 1987లో వెలువరించిన 'చిత్ర సింహపురీయం' ప్రత్యేక సంచిక పాఠకలోకాన్ని బాగా ఆకట్టుకుంది. 1997లో స్వాతంత్ర్య స్వర్ణోత్సవ భారతికి అక్షరనీరాజనంగా 'లాయర్' సమర్పించిన విశేష సంచిక అందరి ఆదరాభిమానాలకు పాత్రమైంది. ఇంకా, మన సింహపురి సీమకు చెందిన మహనీయులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, విలక్షణ నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ బెజవాడ రామచంద్రారెడ్డి వంటి విశిష్టమైన వ్యక్తుల జీవితాలను వివరిస్తూ పాఠకలోకానికి 'లాయర్' అందించిన స్పెషల్స్ వేటికవే సాటి..అన్నట్లుగా వుంటాయి. విద్యారంగం, చేనేతరంగం, పారిశ్రామిక రంగం, వ్యవసాయరంగం, ఆధ్యాత్మికరంగం.. ఇలా ఒక్కో అంశంపై విలక్షణమైన వ్యాసపరంపరలతో 'లాయర్' 2000వ సంవత్సరంలో 'ఈ మాసం' మీకోసం అన్నట్లుగా ఏకబిగిన 15 వినూత్నమైన అంశాలపై అనుబంధ సంచికలను పాఠకులకు సగర్వంగా అందించింది.

2006లో 'లాయర్' రజతోత్సవ సంచిక వైభవం అంతా ఇంతా కాదు. సాహితీవేత్తలకు అదో పండుగ అన్నట్లుగా కన్నుల పండువగా వెలువరించిన ఈ సంచిక కోసం రాష్ట్రవ్యాప్తంగా కథలపోటీ, కవితల పోటీ నిర్వహించి 25 వేల రూపాయల నగదు బహుమతులను కూడా అందించింది. అత్యద్భుమైన బాపూ బొమ్మ ముఖచిత్రంగా వెలువడిన ఈ సంచికను అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. ఈ రజతోత్సవ సంబరాల సందర్భంగా ఆ మహానేత డా.వైఎస్ సువర్ణహస్తాలతో 'లాయర్' తనకంటూ ఓ సొంత కార్యాలయాన్ని కూడా ప్రారంభించుకోగలిగింది. 2008లో 'లాయర్' 27వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేకసంచిక, 2011 'లాయర్' 30వ జన్మదినోత్సవం సందర్భంగా 'ఇదీ నెల్లూరు' పేరుతో వెలువరించిన ప్రత్యేకసంచిక నేటికీ పాఠకాదరణను పొందుతూనే వున్నాయి. నెల్లూరుజిల్లా సమగ్ర సమాచారాన్ని, మండలాలవారీగా వివరిస్తూ..ఆయా మండలాల చరిత్ర, విశిష్టతలను క్లుప్తంగా పొందుపరిచి ప్రచురించిన 'ఇదీ నెల్లూరు' జిల్లావాసులకు, అధికారులకు కూడా ఒక దిక్సూచిగా వుంటోంది.



## హాస్యరస గుళిక..'గల్పిక'

ఇలా ఎప్పటికప్పుడు ప్రత్యేక సంచికలు, రకరకాల శీర్షికలు, సరికొత్త కథనాలతో పాఠకలోకం ప్రశంసలు అందుకుంటూనే వుంది లాయర్. సాహిత్య, సంగీత, కళా, క్రీడారంగాల వార్తలకు, ప్రతిభకు పట్టం కట్టేలా అనేక కథలు, కవితలు, వ్యాసాలు ప్రచురించింది. ప్రత్యేకించి ప్రతివారం వచ్చే ఈ హాస్యరసగుళిక.. 'గల్పిక'.. లాయర్‌కు ఓ హైలెట్ అని ప్రత్యేకించాల్సిన అవసరం లేదు. సున్నితమైన హాస్యంతో రసభరితంగా వుండడమే కాక, ప్రభుత్వాలకి కనువిప్పుగా కూడా వుండే గల్పికలవి. సాహిత్యంలోఒక వినూత్నమైన ఈ ప్రక్రియ అందరినీ అలా హాయిగా నవ్విస్తూ.. వ్యంగ్య విమర్శనాత్మక శైలీవిన్యాసంతో.. అమోఘమైన రచనా సంవిధానంతో వుంటుంది. పాఠకలోకంలో బాగా ప్రాచుర్యం పొందిన ఆ గల్పికలన్నిటినీ ఏర్చికూర్చి ఇప్పటికే నాలుగు భాగాలుగా ముద్రించి, 400 గల్పికలను పుస్తకరూపానికి తెచ్చి పాఠకలోకానికి అందించిన ఘనత కూడా 'లాయర్'దే.

## రాజకీయ కథనాలలో మేటి!

దినపత్రికలకు ధీటైన రాజకీయ కథనాలను ఆసక్తికరంగా అందించడంలో 'లాయర్'ది ఎప్పుడూ పైచేయే! నెల్లూరుజిల్లా రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు పాఠకుల ముందుంచడంలో 'లాయర్' ఎప్పుడూ ముందుండేది. నలపరెడ్లు, నేదురుమల్లి వర్గాల మధ్య నెలకొన్న 'కోట-వాకాడు'ల యుద్ధాన్ని మొదలుకొని జిల్లాలో వర్గ రాజకీయాలపై సమగ్ర సమాచారమిచ్చింది. రాజకీయ పరిణామాలపై 'లాయర్' అంచనాలు సైతం ఎప్పటికప్పుడు నిజమవుతూ వచ్చాయి. ప్రతి ఎన్నికలలోనూ ఓటరు నాడి పసిగట్టి 'లాయర్' ఇచ్చే ముందస్తు ఫలితాలు కూడా దాదాపు ఆచరణ రూపం దాల్చేవి. 1983లో, 1985లో ఎన్టీఆర్‌కే ప్రజలు జై కొట్టబోతున్నారని చెప్పినా, 1989లో అదే ఎన్టీఆర్‌ను ప్రజలు తిరస్కరిస్తున్నారని చెప్పినా అది 'లాయర్'కే చెల్లింది. 1994లో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని 'లాయర్' పసిగట్టింది. 2004లో వై.యస్. జరిపిన పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలలో పెనుసంచలనం సృష్టించబోతోందని, ప్రజాప్రభంజనంలో తెలుగుదేశం ప్రభుత్వం కూలిపోతుందని జోస్యం చెప్పింది 'లాయర్'.

2009 ఎన్నికల్లో ప్రజారంజక పాలకుడిగా వై.యస్. నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ గెలుచుకోబోయే సీట్లను సైతం 'లాయర్' ముందుగానే చెప్పడం విశేషం. వై.యస్. మరణం తర్వాత రాష్ట్ర రాజకీయ తెరపై 'వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ' ఆవిర్భవించనుందని చాటింది 'లాయర్'. జిల్లా రాజకీయాలలో అయితే 'లాయర్' కథనాలు ప్రత్యేకతను సంతరించుకునేవి. జిల్లా రాజకీయాలను తెలుసుకోవాలంటే 'లాయర్'ను చదవాలన్నంతగా రాజకీయ సమగ్ర కథనాలను అందించిన ఘనత 'లాయర్'దే!



## 'లాయర్' సారధికి రెండు అంతర్జాతీయ అవార్డులు


'లాయర్' వారపత్రిక అధినేత, దివంగత తుంగా రాజగోపాల్‌రెడ్డి తనయుడైన తుంగా శివప్రభాత్‌రెడ్డికి జర్నలిజంలోనూ, సమాజసేవలోనూ ఎంతో విశిష్టమైన రెండు అంతర్జాతీయ అవార్డులు (నాటా-ఆటా) లభించడం చిన్నపత్రికల రంగంలోనే అపూర్వం..సింహపురిసీమకే గర్వకారణం. 2012 జూన్ 29వ తేదీన అమెరికాలో నాటా నుంచి 'ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అండ్ కమ్యూనిటీ సర్వీస్ అవార్డ్' ను ఆయన టెక్సాస్‌లోని హ్యూస్టన్ నగరంలో డాక్టర్ ఎన్.ప్రేమసాగర్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. అదేవిధంగా, 2012 జులై 6వ తేదీన అమెరికా, జార్జియా రాష్ట్రంలోని అట్లాంటా నగరంలో 'ఔట్‌స్టాండింగ్ పర్‌ఫార్మన్స్ ఇన్ జర్నలిజం అవార్డ్'ను 'ఆటా' నుండి అప్పటి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి డి.శ్రీధరబాబు చేతులమీదుగా అందుకున్నారు.

## ప్రపంచానికి చేరువవుతూ... ఇంటర్‌నెట్ ఎడిషన్!

వింటే..భారతం వినాలి. చదివితే 'లాయర్' పత్రికే చదవాలి అన్నట్లుండే 'లాయర్' పత్రికకు ఎన్నో విశిష్టతలున్నాయి. అత్యంత అధునాతనమైన నేటి సమాజంలో..అరచేతిలో ప్రపంచం ఒదిగిపోయిన నేటిరోజుల్లో విశ్వవ్యాప్తంగా తెలుగువారు ఎక్కడ వున్నా, ముఖ్యంగా మన నెల్లూరీయులు ప్రపంచంలో ఏ మూలన వున్నా వారికి సింహపురి సమాచారాన్ని వెంటనే తెలియజేసేందుకు వీలుగా 2002 నవంబర్ 8న 'లాయర్' స్థానిక వారపత్రికా రంగంలోనే సంచలనం కలిగిస్తూ 'ఇంటర్‌నెట్ ఎడిషన్'ను కూడా ప్రారంభించింది. ఈ సందర్భంగా అదే రోజున ఇంటర్‌నెట్ ఎడిషన్ ప్రారంభోత్సవ విశేష సంచికను కూడా ప్రచురించింది. నెట్ ఎడిషన్‌ను ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుతూ ఈ-పేపర్‌ను 2006 నుంచే అందిస్తున్న ఏకైక స్థానిక వారపత్రిక 'లాయర్' కావడం లాయర్ సాధించిన విజయాల్లో ఒకటి. అంతేకాదు, ఈ 35 ఏళ్ళలో ఎన్నో అద్భుతమైన అనుబంధ సంచికలు, ప్రత్యేక సంచికలు, విశేష సంచికలు ప్రచురించి నెల్లూరీయుల కలల పంటగా..అశేష పాఠకుల విశేష ప్రశంసలందుకున్న ఘనత 'లాయర్'కే దక్కిందంటే అతిశయోక్తి కాదు.

### ఎంఎస్ రెడ్డి జీవితకథ..

## ధారావాహికం.. మరో సంచలనం




ప్రఖ్యాత సినీ నిర్మాత, నటుడు, సహజకవి మల్లెమాల తన జీవితచరిత్రను 'ఇదీ నా కథ'..అనే శీర్షికతో రచించి పుస్తకంగా వెలువరించగా, దానిని 'లాయర్' ధారావాహికంగా ప్రచురించింది. పాఠకలోకంలో అది ఎంతో సంచలనం కలిగించింది. ఆయన జీవించి వున్నప్పుడే 2011లో ఆ ధారావాహికను ప్రతివారం లాయర్‌లో ప్రచురించడం ప్రారంభించింది. 'లాయర్'లో తన జీవితకథను ప్రచురించడం చూసి ఆయన ఎంతో ఆనందించి అభినందించారు.

## వివాహ వ్యవస్థ ప్రాశస్త్యాన్ని తెలిపే 'పెళ్ళిపుస్తకం'

లాయర్ తన అనుబంధ సంచికల ప్రచురణల ప్రస్థానంలో భాగంగా 2014లో నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సింహపురి సీమ ముద్దుబిడ్డలైన అనేకమంది చిన్నారుల ప్రతిభా పాటవాలను, విద్యా, కళా సాహిత్య క్రీడారంగాల్లో వారికున్న అసామాన్యమైన ప్రతిభను కన్నులకు కట్టినట్లుగా చూపుతూ వెలువరించిన 'చిన్నారుల విజయదీపిక' చిన్నారిలోకానికి 'లాయర్' అందించిన ప్రియమైన కానుక. అదేవిధంగా, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలతో నెల్లూరును మరో తిరువాయూర్ చేసి, నెల్లూరుకు భక్తి భావసమన్వితమైన సంగీత మాధుర్యాన్ని అద్దిన మహనీయుడు..విశ్వవిఖ్యాత గాయకుడు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రిగారైన శ్రీ పండితారాధ్యుల సాంబమూర్తి విశిష్టమైన జీవితాన్ని అక్టోబర్ 2015లో 'లాయర్' విశేషసంచికగా ప్రచురించి సంగీతలోకానికి..పాఠకమహాశయులందరికీ మరో అపురూప కానుకగా అందజేసింది. 'లాయర్' వ్యవస్థాపకుడు, దివంగత కలంయోధుడు తుంగా రాజగోపాలరెడ్డిగారి జన్మదినమైన నవంబర్ 8వ తేదీని పురస్కరించుకుని 1996లో తొలిసారిగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తుంగా పండుగ మొదలు, 1997లో స్థానిక పత్రికారంగంలోనే ఓ సంచలనంగా నిర్వహించిన పాఠకుల పండుగ నభూతో నభవిష్యతి అనే రీతిలో జరిగి ప్రజల ఆశీస్సులందుకుంది. 'లాయర్' ఇలా ఏ కార్యక్రమం నిర్వహించినా ప్రజల ఆశీస్సులు నిండుగా..మెండుగా వుంటూ వుండడం లాయర్ చేసుకున్న అదృష్టమనే చెప్పాలి. ఇటీవల ఏప్రిల్ 15, 2016 న శ్రీరామనవమి పర్వదిన సందర్భాన్ని పురస్కరించుకుని..ఎంతో విశిష్టమైన మన వివాహ వ్యవస్థ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ వెలువరించిన లాయర్ 'పెళ్ళిపుస్తకం' కూడా అందరి ప్రశంసలూ అందుకుంది. ఈ సందర్భంగా వైవాహిక జీవితంలో 50 ఏళ్ళు పూర్తిచేసుకున్న పలువురు దంపతులను ఆహ్వానించి, నెల్లూరు పురమందిరం వేదికపై వేలాదిమంది ప్రజల సమక్షంలో.. ఆ దంపతులకు వేదపండితుల ఆశీర్వచనాలు అందజేయడం అద్వితీయమైన విషయం. అంతేకాదు, శ్రీరామనవమి సంబరాలను కూడా మరింత వేడుకగా నిర్వహించి, సంస్కృతీ సంప్రదాయాల పట్ల 'లాయర్'కు వున్న గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసుకంది. ఎంతో కనువిందుగా 'లాయర్' నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలు సింహపురీయుల మనసుల్లో కలకాలం అలాగే నిలచిపోతాయి కూడా. ఇలాంటి అపురూపమైన కార్యక్రమాలనెన్నిటినో అలుపు లేకుండా అవిశ్రాంతంగా.. దిగ్విజయంగా నిర్వహిస్తున్న లాయర్.. ప్రజల చల్లని దీవెనలతో.. పాఠకుల ఆశీస్సులతో 'లాయర్' అక్షరదీపాలను నిరంతరం వెలిగిస్తూనే వుంది. పత్రికారంగంలో తనకంటూ ఒక విశిష్టతను సాధించుకంటూ, స్థానిక వారపత్రికారంగంలోనూ వాస్తవ వార్తలకు ప్రాధాన్యత ఇచ్చే పత్రికగా అందరి ప్రశంసలందుకుంటూ... ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందంటూ.. ముందుకు మున్ముందుకు సాగిపోతూనే వుంది.

## గ్రామీణ వనంలో విరిసిన...

# విద్యాపుష్పమే ఎన్‌బికెఆర్



## • జిల్లాలో తొలి సాంకేతిక విద్యాలయం



**ఓ మహనీయుని దూరదృష్టికి, అతని సేవా భక్తికి, సమాజం పట్ల అనురక్తి, దీనజనుల పట్ల వున్న భక్తికి ప్రతిరూపవమే కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యా సంస్థలు. అతను వెలిగించిన చదువుల చిరుదివ్వె ఈరోజు అఖండ జ్యోతిలా వెలుగుతోంది. ఎన్నో వేలు, లక్షల మంది ఆ వెలుగులో తమ ఉజ్వల భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఇంతమంది గుండెల్లో చదువుల వెలుగులు నింపిన ఆ విద్యాజ్యోతి పేరే స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి.**

79ఏళ్ల క్రితం హరిజన విద్యార్థి ఉద్ధారక సంఘం పేరుతో ఆయన విద్యానగర్ కేంద్రంగా విద్యాభివృద్ధికి బీజం వేశారు. ఎందరో దళిత, పేద విద్యార్థులను చదువు మార్గం పట్టించి, వారి బ్రతుకుల్లో వెలుగులు నింపారు. విద్యానగర్‌లో విద్యాభివృద్ధికి నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి వెలిగించిన విద్యాజ్యోతిని ఆ తర్వాత కాలంలో తన రెండు చేతులు అడ్డం పెట్టి ఆ వెలుగులను కాపాడిన ఘనత స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిదే! నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని ఆయన కలలను సాకారం చేసే లక్ష్యంతో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఈ సంస్థ అభివృద్ధిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారు. 1979లో నెల్లూరే ఒక గ్రామంగా ఉండేది. ఇక విద్యానగర్ ఏ స్థాయిలో ఉండేదో వేరే చెప్పనక్కరలేదు. ఆ కాలంలో ఇంజనీరింగ్ కాలేజీలంటే ఏ పెద్ద నగరాలకో పరిమితం. ఆ కాలంలో కూడా విద్యానగర్ అనే గ్రామంలో ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీని 184 ఎకరాల సువిశాల స్థలంలో నిర్మించారు. రాష్ట్రంలోనే ఇది రెండో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల. 13,500చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు, 14ఎకరాలలో క్రీడా ప్రాంగణం, విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్స్, 75లక్షలతో లైబ్రరీ, అధునాతన ల్యాబ్‌లు, అవుట్‌డోర్, ఇండోర్ గేమ్స్, 24గంటలూ కరెంట్, కళాశాల ప్రాంగణంలోనే అధ్యాపకులకు నివాసగృహాలు, వైఫై వంటి అన్ని సౌకర్యాలతో ఈ విద్యాసంస్థ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది.

ఎన్‌బికెఆర్‌లో ఇంజనీరింగ్ చదవడమంటే విద్యార్థులు లండన్ కేంబ్రిడ్జి యూనివర్శిటీలో చదివిన అనుభూతికి లోనయ్యేవాళ్ళు. అంతటి మంచి వాతావరణం ఈ కాలేజీ సొంతం. ఈ కాలేజీలో చదివిన వాళ్లు ఈరోజు వివిధ రంగాలలో అగ్రగణ్యులుగా దేశ, విదేశాలలో సైతం రాణిస్తుండడం విశేషం.

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అనంతపురం జెఎన్‌టియుకి అనుబంధంగా స్వయంప్రతిపత్తి కలిగి వుంది. నాక్(యుజిసి) వారిచే రెండుసార్లు ఏ-గ్రేడ్ విద్యాసంస్థగా గుర్తింపు పొందింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి కూడా ఏ-గ్రేడ్ గుర్తింపు పొంది ఉండడం గమనార్హం. యూజిసిచే 'కాలేజీ విత్ పొటెన్షియల్ ఫర్ ఎక్సలెన్సీ'(సిపిఇ) గుర్తింపు పొందింది. ఈ కళాశాలలో అధ్యాపకులంతా సుశిక్షితులైన ఎంటెక్, పిహెచ్‌డి పట్టభద్రులే!

గ్రామీణ వాతావరణంలో వెలిసిన ఆధునిక సాంకేతిక దేవాలయం ఎన్‌బికెఆర్. సంస్థ కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, కళాశాల ఛైర్మెన్ ప్రొఫెసర్ ఐ.గోపాలరెడ్డి, డైరక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డిల నేతృత్వంలో ఈ విద్యాసంస్థలు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించాయి. ఎన్‌బికెఆర్‌లో సీటు రావడమంటే విద్యార్థి ఇంట పండుగే!









### మెరిట్ స్కాలర్‌షిప్స్

**- నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి**

ఎన్‌బికెఆర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చేరబోయే విద్యార్థులకు నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్నట్లు ఫౌండేషన్ ఛైర్మెన్ మరియు కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలియజేశారు. తమ కళాశాలలో చేరే ప్రతి విద్యార్థికి ఉద్యోగం కల్పించడానికి మొదటి సంవత్సరం నుండే ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# పత్రాలు లేని వాహనాలపై కొరడా

సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలపై రవాణాశాఖ అధికారులు సోమవారం కొరడా ఝుళిపించారు. నెల్లూరు నగరంలోని విఆర్‌సి సెంటర్, మద్రాసుబస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉపరవాణా కమిషనర్ ఎన్.శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అన్‌రిజిష్టర్డ్, హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి బుక్, ఇన్సూరెన్స్‌లు లేని 35వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ వాహనాల నుంచి అపరాధ రుసుం క్రింద రూ.1.65లక్షలు వసూలు చేశారు. డిటిసి శివరాంప్రసాద్ మాట్లాడుతూ రిజిష్టర్ చేసుకోని వాహనం తొలిసారి పట్టుబడితే రూ.5వేలు, రెండవసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వాహనాల అధికారులు ఆదినారాయణ, బాలమురలీకృష్ణ, రామకృష్ణారెడ్డి, ఎంవిఐలు పూర్ణచంద్రరావు, రవికుమార్ పాల్గొన్నారు.




### పనితీరును
### మెరుగు పరుచుకోవాలి

వైద్యులు, సిబ్బంది పనితీరును మెరుగుపరచుకొని వైద్యం అందించాలని, ప్రభుత్వాసుపత్రిలో సేవా భావంతో పనిచేయాలని అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరశింహారావు అన్నారు. సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా, శిశు విభాగాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతా శిశు విభాగానికి రోజుకు 300 మందికి పైగా వైద్యం కోసం వస్తున్నారన్నారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావడంలేదని విమర్శలు ఉన్నాయన్నారు. ఆసుపత్రిలో వైద్యంతో పాటు, రక్తపరీక్షలు, నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. తాగునీటి సమస్యను తీర్చినట్లు పేర్కొన్నారు. 108 వాహనాన్ని, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏరియల్ పౌడర్ వేసి ఉతికినా ఎలుక తోలు నలుపే గాని తెలుపురాదు. పెద్దాసుపత్రి తీరూ అంతే! చాట్ల ఎన్ని ప్రయత్నాలు చేసినా వృధా ప్రయాసే! ఈ కార్యక్రమంలో గిరి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డా॥శ్రీనివాస్ పాల్గొన్నారు.


# కదులుతున్న కిసాన్ సెజ్



దివంగత నేత వై.యస్.రాజశేఖర రెడ్డి హయాంలో శంకుస్థాపన చేయబడ్డ కొడవలూరు మండలంలోని రాచపాలెం వద్ద గల ఇఫ్‌కో కిసాన్‌సెజ్ అభివృద్ధి ఇప్పుడిప్పుడే ముందుకు కదులుతోంది. అప్పట్లో దీనిని వ్యవసాయ ఉత్పత్తులు, అనుబంధ సంస్థల పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో వై.యస్. దీనిని ఏర్పాటు చేశారు. సేకరించిన వేలాది భూముల చుట్టూ కాంపౌండ్ వాల్ కూడా కట్టారు. వై.యస్. మరణంతో ఈ సెజ్‌ను ఆ తర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోలేదు. సెజ్ నిరుపయోగంగా ఉందని, తమ భూములను తాము సాగు చేసుకుంటామని ఇటీవల కాలంలో స్థానిక రైతులు ఆందోళనలకు దిగసాగారు.

అయితే ఇటీవల ఈ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి బీజం పడింది. సెజ్ బయటే పలు పరిశ్రమలు వచ్చాయి. సెజ్ పక్కనే దామవరం ఎయిర్‌పోర్టు కూడా మంజూరైంది. ఈ నేపథ్యంలో కిసాన్ సెజ్‌లో కూడా పరిశ్రమలు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకొచ్చాయి. ఇప్పటికే 12 కంపెనీలు పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఏపిఐఐసితో ఒప్పందం చేసుకున్నాయి. ఈ 12 పరిశ్రమలకే 1500 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. 1500 కోట్లకు పైగా పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా సెజ్ పరిధిలో రోడ్డు, నీళ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటు దిశగా కదలిక వస్తే, జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో పాటు నెల్లూరు, కావలి మధ్య హైవే పక్కన భూములకు మళ్లీ రెక్కలు మొలిచే అవకాశాలున్నాయి.





# ఈ నెలలో సిఎం పర్యటన

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 18న జిల్లా పర్యటనకు వచ్చే అవకాశాలున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో ఆయన పర్యటన ఉండబోతోంది. ఇక్కడ నిర్మించిన చిప్పలేరు ఫైబర్ డ్యాంను ఆయన ప్రారంభిస్తారు. అలాగే ఉదయగిరితో పాటు కృష్ణపట్నం పోర్టు పరిధిలోని పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనే అవకాశాలున్నాయి. ఆయన పర్యటన అధికారికంగా ఇంకా ఖరారు కాలేదు.

# పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్

ఈనెల 5వతేదీ నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ నెల్లూరు నగర పరిధిలోని 43వ డివిజన్‌లోని జెండావీధి, కోటమిట్ట, చిన్నబజారు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న సందర్భంగా ముస్లిం సోదరులు ఎక్కువగా నివశించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగుకు కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ మాసంలో ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేకంగా మంచినీరు, వీధిలైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కనీసం పవిత్ర రంజాన్ మాసం పూర్తయ్యేవరకు కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండి ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం.డి.ఖలీల్‌అహ్మద్, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్, ఓబిలి రవిచంద్ర, నాయకులు కుంచాల శ్రీనివాసులు, జాఫర్, ఖాజామియా, ఖాసిం, దార్ల వెంకటేశ్వర్లు, వంగాల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అపురూప మహిళకు ఆత్మీయ సత్కారం



అభినందన సభలో దీపావెంకట్‌తో ఎమ్మెల్సీ సోమిరెడ్డి, ఉషమ్మ, కలెక్టర్ జానకి, ఎస్పీ విశాల్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ అజీజ్ తదితరులు

తండ్రికి తగ్గ తనయగా రాణిస్తూ, తన తండ్రి సేవా స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని గ్రామీణ వికాసానికి పాటుపడుతున్న వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు కుమార్తె శ్రీమతి ఐ.దీపావెంకట్ ఇటీవల ఢిల్లీలో కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి స్మృతిఇరానీ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక ఐకానిక్ ఉమెన్ ఆఫ్ ది డికేడ్ అవార్డును అందుకోవడం తెలిసిందే! తండ్రి జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తుంటే... ఆయన కుమార్తెగా దీపావెంకట్ అంతర్జాతీయ స్థాయిలో తన సామాజిక సేవా దృక్పథం ద్వారా గుర్తింపును సాధించింది.

ఆమెకొచ్చిన అతి అరుదైన గుర్తింపును పురస్కరించుకుని నెల్లూరు రూరల్ మాదరాజుగూడూరులో ఆమె ఆప్తులు సిద్దారెడ్డి రంగారెడ్డి, కవితలు ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, సీనియర్ రాజకీయవేత్త సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరురూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి, యస్.పి విశాల్‌గున్నీ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, 'లాయర్' వారపత్రిక నిర్వాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డిలు వక్తలుగా పాల్గొని మాట్లాడారు.

వెంకయ్యనాయుడి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని సేవా సామ్రాజ్యంలో పరిమళిస్తున్న "దీపమ్మ" తన సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాలని కోరుకుంటూ ఆమెకు లభించిన అతి అరుదైన అవార్డు ఆమెపై మరింత బాధ్యతలను వుంచిందని వక్తలు తమ ప్రసంగంలో అన్నారు. వెంకయ్యగారితో వున్న అనుబంధాన్ని వారి కుమార్తె కొనసాగిస్తూ రాజకీయాలకు అతీతంగా అందరితో అప్యాయంగా వ్యవహరిస్తున్నారని మాట్లాడిన అందరూ తమ ప్రశంసల వర్షాన్ని దీపమ్మపై కురిపించారు. తన తల్లి శ్రీమతి ఉషమ్మ ఆశీస్సులు తీసుకున్న అనంతరం దీపమ్మ మాట్లాడుతూ "వెంకయ్య" కూతురిగా కాకుండా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు రావాలనే తపనతో స్వర్ణభారత్ సేవలను విస్తరిస్తున్నానని, 108 దేశాల ప్రతినిధుల సమక్షంలో తనకు లభించిన ఈ సత్కారం తన బాధ్యతలను నిత్యం గుర్తు చేస్తూ వుంటుందని అన్నారు. 16 సంవత్సరాలుగా సేవే లక్ష్యంగా తాను చేస్తున్న కృషికి, ఎంతో మంది ఆత్మీయుల ద్వారా తనకు లభిస్తున్న ప్రోత్సాహానికీ, ఆశీస్సులకీ గుర్తుగా తనకి ఈ అవార్డు లభించిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రెడ్‌క్రాస్ కార్యదర్శి డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ డైరెక్టర్ రవీంద్రబాబు, నెల్లూరు రూరల్ డీఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, స్వర్ణభారత్ ట్రస్ట్ సమన్వయకర్త సి.హెచ్.జనార్ధన్‌రాజు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


## డా॥ బెజవాడ గోపాల్‌రెడ్డి మహిళా డిగ్రీ కళాశాల

విక్రమ సింహపురి యూనివర్శిటీకి అనుబంధం

కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణము, దర్గామిట్ట, నెల్లూరు - 524 003.

ఫోన్ : 0861- 2326461, సెల్ : 9052171442, 9704646196

(స్థాపితము : 1997)

**మా ప్రత్యేకతలు :**

- కేవలం మహిళల కోసమే స్థాపించబడి గత 19 సంవత్సరాలుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ.
- గత విద్యా సంవత్సరం యూనివర్శిటీ నిర్వహించిన పరీక్షలలో నెల్లూరు జిల్లాలోనే ఉత్తీర్ణతా శాతంలో ద్వితీయ స్థానం సాధించిన ఏకైక విద్యా సంస్థ.
- ఆహ్లాదకరమైన వాతావరణంలో మహిళలకు పూర్తి భద్రత కల్పిస్తున్న విద్యాసంస్థ.
- లాభాపేక్ష లేకుండా విలువలతో కూడిన విద్యనందిస్తున్న సేవా సంస్థ.
- ఉత్తమ అధ్యాపకులచే అత్యుత్తమ శిక్షణ.
- సాహిత్య, సాంస్కృతిక, క్రీడారంగాలలో ప్రోత్సాహం.
- క్యాంపస్ సెలక్షన్స్ కొరకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ.

**అందుబాటులోని కోర్సులు : బిఎస్‌సి., బి.కాం**

- బి.కాం - కంప్యూటర్ అప్లికేషన్స్
- బి.ఎస్‌సి : మాథ్‌మాటిక్స్ - స్టాటిస్టిక్స్ - కంప్యూటర్ సైన్స్
- బి.ఎస్‌సి : బయో - టెక్నాలజీ - కెమిస్ట్రీ - కంప్యూటర్ అప్లికేషన్స్
- బి.ఎస్‌సి : బయో - టెక్నాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ
- బి.ఎస్‌సి : మైక్రోబయాలజీ - బయో - కెమిస్ట్రీ - కెమిస్ట్రీ
- బి.ఎస్‌సి : మైక్రోబయాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ

**సీట్లు పరిమితం**

**అడ్మిషన్లు కొరకు ఆఫీసులో సంప్రదించండి**

వి.మృదుల M.Sc., - ప్రిన్సిపాల్.

జె.వి.రెడ్డి - సెక్రటరీ & కరస్పాండెంట్.

### రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా...

# రైతులకు రుణమాఫీ ఘనత బాబుదే!

**- ఎమ్మెల్యే పాశం**

రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో వున్నా రైతులకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో నవనిర్మాణ దీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖలు రెండేళ్లలో సాధించిన ప్రగతిపై రైతులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, ఇప్పటికే రుణ ఉపశమన పత్రాలను అందజేయడంతో పాటు రాయితీలపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలను అందజేసి రైతుల అభివృద్ధికి చర్యలు చేపట్టారన్నారు. సబ్ కలెక్టర్ గిరీష మాట్లాడుతూ ఉద్యాన, వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక శాఖల అధికారులు రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఫోటోఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించడం జరిగిందన్నారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సిఇఓ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ బొమ్మిరెడ్డి పద్మ, వైస్ ఎంపిపి మట్టం శ్రావణి, పిట్టి నాగరాజు, ఎంపిడివో భవాని, తహశీల్దార్ సత్యవతి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. తరువాత పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ గిరీషా తదితరులు

### పాలిటెక్నిక్ కళాశాలలో

## పూర్వవిద్యార్థుల కలయిక

గూడూరు పట్టణంలోని తిలక్ నగర్‌లో వున్న పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం 1997-2000 సంవత్సరాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు కలిశారు. చదువుకొనే రోజులను నెమరు వేసుకున్నారు. ఎవరెవరు ఏయే ఉద్యోగాల్లో స్థిరపడ్డారో తెలుసుకుని ఆనందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ అందరూ కలవడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉండటం కళాశాలకు గర్వకారణమన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకొని అదే విధంగా ప్రగతిపథంలో ముందుకు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల అధ్యాపకుడు పొనకా శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకురాలు వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమాం

## వివిఎస్ఆర్ హవా

2015-16 విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో గూడూరులోని వివిఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు సంచలన ఫలితాలను సాధించినట్లు కరస్పాండెంట్ నందిమండలం అన్నపూర్ణ తెలిపారు. 43 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయితే 43మందీ ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎం.నితిన్ స్వరూప్ 10కి 10 పాయింట్లు సాధించాడన్నారు. 9జిపిఎకు పైగా 22మంది, 8జిపిఏకి పైగా 13మంది, 7జిపిఎకి పైగా 8మంది సాధించినట్లు తెలిపారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. స్కూల్‌ను 2009లో ప్రారంభించి మంచి ఉపాధ్యాయులను పెట్టి మంచి చదువును పిల్లలకు అందిస్తున్నట్లు తెలిపారు. పేదప్రజలకు అందుబాటులో ఫీజులు ఉన్నట్లు పేర్కొన్నారు.






## గూడూరు డివిజన్ వార్తలు

### పోలీసులకు ప్రజలకు మధ్య

## స్నేహపూర్వక సంబంధం ఉండాలి

పోలీసులకు, ప్రజలకు నడుమ స్నేహపూర్వక సంబంధాలు ఉంటే నేరాల సంఖ్య క్రమంగా తగ్గుతుందని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో శ్రీలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లని సోమవారం రూరల్ సిఐ శ్రీనివాసులు రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛంధ సంస్థల సహకారంతో డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్లను ఆధునీకరించి మరుగుదొడ్లను నిర్మించేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. సంస్థ నిర్వాహకులు పిఎంరావు, శ్రీలక్ష్మిలను డిఎస్పీ శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సుబ్బారావు, రూరల్ ఎస్ఐ జగన్‌మోహన్‌రావు, పట్టణ ఎస్సై దశరథరామారావు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌లో మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న డిఎస్పీ బి.శ్రీనివాస్ తదితరులు

## ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల సందడి



చిల్లకూరు మండలం, తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వేసవి సెలవులు ముగియడంతో అమ్మవారిని దర్శించుకొనేందుకు సమీప, దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారికి పొంగళ్లుపెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. చీర, సారె పెట్టి చల్లగా చూడాలని వేడుకొన్నారు. భక్తుల రద్దీ కారణంగా దర్శనం కోసం క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆలయ ఇవో శ్రీనివాసులు రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బారికేడ్ల ఏర్పాటు

గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డు, మార్కెట్ కూడలి, గడియారం స్థంభం కూడలి ప్రాంతాల్లో బారికేడ్లను సోమవారం పట్టణ సిఐ సుబ్బారావు, ఎస్సై దశరథరామారావు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా బారికేడ్లను ఉంచడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుందని వారు తెలిపారు.



## రెడ్ సంస్థ సేవలు అభినందనీయం


వికలాంగులకు ఫలసరుకులు అందజేస్తున్న సిఐ సుబ్బారావు, పక్కన ఎస్ఐ దశరథరామారావు

వికలాంగులకు ప్రతి నెల ఫలసరుకులను అందజేస్తున్న రెడ్ సంస్థ సేవలు అభినందనీయమని పట్టణ సిఐ సుబ్బారావు అన్నారు. ఆదివారం గూడూరు కృష్ణ మందిరంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులకు ఫల సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు సైతం వికలత్వంతో బాధపడుతున్నా అధైర్య పడకుండా ఆత్మవిశ్వాసంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దశరథరామారావు తదితరులు పాల్గొన్నారు.




## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వ్యాపారాలు ఒక మోస్తరుగా సాగుతాయి. ఆశయాలు, ఆలోచనలందు మార్పులు కలుగుతాయి. పనులు నిదానంగా జరుగుతాయి. కార్యనిర్వహణ సామర్థ్యం బాగుంటుంది. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఆర్థికపరమైన వత్తిడులున్నా సర్దిచెప్పుకొనాలి. ఏ విషయంలో కూడా సర్దుకొనిపోవాలి గాని, ప్రతిఘటించకూడదు. తొందరపాటు తగ్గాలి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తివ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరం. ఖర్చులు కూడా పెరుగుతాయి, కాని ఇబ్బందులుండవు. బిడ్డల విద్యావివాహ విషయాలందు అనుకూలత కలదు. పెట్టుబడులకు, ఆర్థిక పరమైన ఒప్పందాలకు అనుకూలత బాగుంటుంది. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. బంధువర్గాల నుండి శుభవార్తలు వింటారు. ఆరోగ్య విషయంలో దృష్టిపెట్టండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపార రంగంలో ఒడుదుడుకులు, ఇబ్బందులుంటాయి. ఆర్థిక ఇబ్బందులుండినా అధిగమిస్తారు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. శుభకార్య నిర్ణయాలు వాయిదా పడతాయి. స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపాటు వద్దు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసికొనండి. సలహాలు, హామీలు ఇచ్చి ఇబ్బందులు పడవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యంగా ఉండి, అదనపు ఖర్చులు తప్పనిసరి కాగలవు. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. మీ నిర్ణయాలను ఇతరులకు చెప్పి ఒప్పించండి. పరుషంగా వ్యవహరించ వద్దు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరు కాగలవు. ప్రముఖులతో పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. శుభవార్తలు వింటారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 10.6.2016 నుండి**
**తేది. 16.6.2016 వరకు**

ఈ వారం వృషభంలో రవిబుధులు, 15తేది నుండి మిధునంలో రవి, మిధునంలో శుక్రుడు, సింహంలో గురు రాహువులు, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

ముహూర్తములు లేవు.

### జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | శుక్ర | షష్ఠి | రా॥ గం.2.32వ॥ |
| తేది. 11 | శని | సప్తమి | రా॥ గం.3.04వ॥ |
| తేది. 12 | ఆది | అష్టమి | రా॥ గం.4.09వ॥ |
| తేది. 13 | సోమ | నవమి | రా॥ గం.5.40వ॥ |
| తేది. 14 | మంగళ | దశమి | పూర్తిగ |
| తేది. 15 | బుధ | దశమి | ఉ॥ గం.7.28వ॥ |
| తేది. 16 | గురు | ఏకాదశి | ఉ॥ గం.9.27వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక ఇబ్బందులుండి ఖర్చులు పెరుగుతాయి. అయినా డబ్బుకు లోటుండదు. ప్రభుత్వ పరంగా సమస్యలు రాకుండా వ్యాపారులు ఉద్యోగులు జాగ్రత్త పడాలి. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి. స్థిరాస్తుల లావాదేవీలు ఆపడం మంచిది. ఋణాల వత్తిడి ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక వ్యవహారాలను, కుటుంబ లౌకిక వ్యవహారాలను జాగ్రత్తగా నడపండి. ఈ రాశివారికి ఆశించిన ఆదాయం ఉండదు. ఖర్చులు మాత్రం పెరుగుతాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. హామీలు ఇవ్వకండి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. కోర్టు కేసుల వల్ల సమస్య లుండగలవు. ఆరోగ్యం జాగ్రత్త.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక ఇబ్బందులతో సామాన్య సంపాదనతో కష్టపడతారు. వ్యాపారాలలో కొత్త అవకాశాలు పెట్టుబడులుండకపోవచ్చును. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ఇతరులతో వ్యవహారాలలో అపార్థాలు చోటు చేసికొనగలవు. ఉద్యోగ బాధ్యతలు పెరుగుతాయి. అనుకోని ప్రయాణాలు, ముఖ్య వ్యక్తుల వల్ల సొంత పనులు ముందుకు సాగడం ఉంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయ వ్యయాలు సమానంగా ఉంటాయి. పాలుమాలి మీ పనులను ఇతరులకు అప్పగించవద్దు. ప్రమాదం లేకపోయినా అనవసర విషయాలలో తల దూర్చవద్దు. లౌక్యంగా వ్యవహరించి పనులు జరుపుకొనాలి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. బిడ్డల విద్యా, వివాహ విషయాలపై దృష్టిపెడతారు. వ్యాపార, కొత్త పెట్టుబడుల ప్రయత్నాలు ఆపుకొనడం మంచిది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి, ఆదాయం పెరుగుతుంది. ఇంటా బయట మీ మాటకు విలువ గుర్తింపు ఉంటుంది. అనుకున్న పనులు సమర్థతతో సానుకూలం చేసికొంటారు. విలువైన వస్తువులు, గృహోపకరణాలు సమకూరుతాయి. రావలసిన బాకీలపై హామీలు పొందుతారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తులు కొనే అవకాశాలు దొరుకుతాయి. అప్పుడప్పుడు పనులందు ఆందోళన ఉండగలదు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు సరిగా జరగవు. వ్యాపారాలందు అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యవసాయ రంగాల వారికి ఇబ్బందులుండి రాబడి తగ్గుతుంది. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు మంజూరు కాగలవు. నష్టాలను, కష్టాలను మనోధైర్యంగా ఎదుర్కొంటారు. స్థిరాస్తుల లావాదేవీలకు అవకాశాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక ఒప్పందాలు, పెట్టుబడులందు జాగ్రత్త అవసరము. విషయాలను సున్నితంగా పరిష్కరించుకొనండి. కుటుంబంలో భిన్నాభిప్రాయాలతో ఇబ్బందులుంటాయి. వ్యాపార, వృత్తి జీవనాలు సామాన్యంగా సాగుతాయి. ఆదాయం, ఖర్చులు సరిపోతుంటాయి. ప్రభుత్వ అనుమతులు, ప్రభుత్వ సహాయాలు ఆలస్యం కాగలవు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక వ్యవహారాలలోను, కుటుంబ వ్యవహారాలలోను జాగ్రత్తగా నిర్ణయాలు చేయండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. పనులు ఆలస్యమైనా అనుకున్న రీతిలో సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి అభివృద్ధి ఫరవాలేదనిపించగలవు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు కొంత వసూలు కావడం ఉంటుంది. శుభకార్యాలు పెండింగ్‌లో పడగలవు.

# ఢిల్లీకి చేరిన చెప్పు పంచాయితీ!

శ్రీను గల్పిక

అది అనంతపురం జిల్లా 'యాడికి' గ్రామం. వైకాపా జెండాలతో ఆ ప్రాంతమంతా కళకళలాడుతోంది. భారీగా జనం పోగయ్యారు. అంతలో రైతు భరోసా యాత్ర చేస్తూ ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అక్కడకు చేరుకున్నాడు. ప్రజలనుద్దేశించి జగన్... రైతుల కోసం ఏవరన్నా మేలు చేసారంటే అది ప్రియతమ దివంగత నేత, మహానుభావుడు రాజశేఖరరెడ్డి గారే చేశారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ ఆయన నెరవేర్చాడు. కాని ఈ చంద్రబాబు వట్టి మోసకారి. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడు. వాగ్దానాలను నెరవేర్చనివారిని ప్రజలు చెప్పులతో కొడతారు... అని ఆవేశంగా ప్రసంగించాడు.

★★★★★

అది విజయవాడలోని హైటెక్‌రత్న ముఖ్యమంత్రి కార్యాలయం. అప్పుడే టీవీ 10.5లో న్యూస్ వస్తున్నాయి. యాడికిలో చంద్రబాబుపై జగన్ చేసిన చెప్పు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ న్యూస్‌రీడర్... వాగ్దానాలను నెరవేర్చని వారిని చెప్పులతో కొట్టాలన్న జగన్ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తారా? అవును అయితే 'ఎస్' అని, కాదు అని అయితే 'నో' అని టైప్ చేసి ఎస్ఎంఎస్‌లు పంపండి అని చెప్పింది. నిమిషంలోనే 'ఎస్'కు 10శాతం, 'నో'కు 90శాతం రేటింగ్ వచ్చింది. వచ్చింది అనడం కంటే అడ్వాన్స్‌గా టీవీ వాళ్లే ఇచ్చేసారని చెప్పొచ్చు. టీవీలో ఆ వార్త చూసిన చంద్రబాబుకు అరికాల్లో మండింది. వెంటనే మంత్రులు నిమ్మకాయల రాజప్ప, పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణలను పిలిచి... ఆ జగన్ చూడండి ఎంత సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడో, ఎందుకైనా మంచిది, రాష్ట్రంలో ఓ పదిరోజులు చెప్పుల దుకాణాలను మూతేయించండి, అట్లాగే ప్రజలను కూడా కాళ్లకు చెప్పులు లేకుండా తిరగమనండి అని ఆదేశాలు జారీ చేయండని చెప్పాడు. అందుకు అప్పుడే వచ్చి అది విన్న కె.ఇ. కృష్ణమూర్తి... సార్, ప్రజలు అంత పాపాత్ములు కాదు, ఇంతకంటే ఘోరమైన ప్రభుత్వాలనే భరించారు వాళ్ళు... మన ప్రజలు సంస్కారవంతులు... వచ్చిన ఇబ్బందేం లేదని ధైర్యం చెప్పాడు.

★★★★★

రైతుభరోసా యాత్ర ముగించుకుని జగన్ అప్పుడే ఇంటికి చేరాడు. జగన్‌ను చూడగానే ఆయన తల్లి విజయమ్మ సీరియస్‌గా... చిన్నప్పటి నుండి నువ్వు నేర్చుకున్న సంస్కారం ఇదేనా? చిన్నం తరం, పెద్దంతరం లేదా? రాజకీయాలు వేరు... మనుషులను గౌరవించడం వేరు... చెరో పార్టీలో బద్ధశత్రువులుగా వున్నప్పటికీ మీ నాయనే ఎప్పుడూ చంద్రబాబును అంత మాట అనలేదు. బైబిల్ చదివే నీవు నేర్చుకున్నది ఇదేనా? ఆ ప్రభువు కూడా నిన్ను క్షమించడు అని అంది. అప్పుడు జగన్ వాడిపోయిన ముఖంతో... క్షమించమ్మా, రైతుల అవస్థలు చూసి ఆవేశంలో మాట్లాడేసాను, ఇంకెప్పుడూ అలా మాట్లాడను. పాపాన్ని మన్నించమని ఆ ప్రభువును వేడుకుంటాను అని చెప్పాడు. దానికి విజయమ్మ... చేసిన పాపం పదిమందికి చెబితే పోతుందంటారు... కాబట్టి నువ్వు హైదరాబాద్, ఢిల్లీకి పోయి ముఖ్యనేతలను కలిసి జరిగిన తప్పును చెప్పి ప్రాయశ్చిత్తం చేసుకో అని చెప్పింది. జగన్ సరేనని కాళ్లకు చెప్పులు కూడా వేసుకోకుండానే బయలుదేరాడు.

★★★★★

చంద్రబాబు క్యాంప్ ఆఫీసులో కూర్చుని టీవీ ఛానెల్స్‌లో జగన్ వ్యాఖ్యలకు నిరసనగా తెలుగుదేశం కార్యకర్తలు జరుపుతున్న ధర్నాలో జగన్ దిష్టిబొమ్మల దహనాలను చూస్తున్నాడు. మంత్రులు కూడా ఆయనతో పాటు ఆ సీన్‌లు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. అంతలో తగలబడుతున్న ఓ దిష్టిబొమ్మ నుండి "రక్షించండి రక్షించండి" అని కేకలు వినిపించసాగాయి. అది చూసి చంద్రబాబు మంత్రులతో... నా పాలనలో టెక్నాలజీ ఎంతగా డెవలప్ అయ్యిందో చూశారా, టాకింగ్ దిష్టిబొమ్మలు తయారవుతున్నాయి. ఆ దిష్టిబొమ్మను చూస్తుంటే అచ్చం జగన్ కేకలు పెడుతున్నట్లే ఉందన్నాడు. అందుకు దేవినేని ఉమ... సార్, అవి దిష్టిబొమ్మ కేకలు కావు, దిష్టిబొమ్మను తగలబెట్టినప్పుడు పొరపాటున ఆ మంటలు మన కార్యకర్తకు అంటుకున్నట్లున్నాయి, అదిగో ఆర్పేసారులేండి... హమ్మయ్యా అని నిట్టూర్చాడు.

అంతలో చంద్రబాబు సెల్‌ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తాడు. అవతల నుండి కేసీఆర్... అమరావతి రాజధాని ఎంతవరకొచ్చిందని కేసీఆర్ అడిగాడు. ఏ సిటీ టైప్‌లో కట్టాలో ఇంకా ఫైనల్ కాలేదని చంద్రబాబు చెప్పి, ఇంతకూ ఫోన్ చేసింది 'ఓటు - నోటు' కేసు విషయమై కాదు కదా అని అడిగాడు. కేసీఆర్ స్పందిస్తూ... ఆ కేసు సంగతి అవసరం వచ్చినప్పుడు చూసుకుంటాలే... నేను ఫోన్ చేసింది అందుకు కాదు, ఆ జగన్ మిమ్మల్ని అనరాని మాట ఏదో అన్నాడటగా, నా దగ్గరకొచ్చి బాధ పడ్డాడు. పాపం చిన్నపిల్లోడు, అవేమీ మనసులో పెట్టుకోకండి... ఇలాంటివి ఎన్ని పడుంటే మనం ఈ స్థాయికి వచ్చి ఉంటాం అని చెప్పి పెట్టేసాడు. వెంటనే సిపిఎం బి.వి.రాఘవులు ఫోన్ చేశాడు. చంద్రబాబు ఫోన్ ఎత్తగానే... జగన్ కుర్రోడు... రాజకీయాలు వంటబట్టలేదు. ఏం మాట్లాడొచ్చో, ఏం మాట్లాడకూడదో తెలీదు. నా దగ్గరకొచ్చి చెప్పుకుని బాధపడ్డాడు. మీరు అనుభవజ్ఞులు, అర్థం చేసుకోండి అని చెప్పి పెట్టేసాడు. ఆ తర్వాత వరుసగా బీహార్ సీఎం నితీష్ కుమార్, తమిళనాడు సీఎం జయలలిత, పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్‌లు కూడా చంద్రబాబుకు ఫోన్ చేసి... జగన్ మిమ్మల్ని అంత మాట అన్నాడట కదా... అవేం మనసులో పెట్టుకోవద్దు, కుర్రోడు, ఆవేశంలో ఏదో అనేసుంటాడని సముదాయించారు. చెప్పు పంచాయితీ ఇంత మందికి తెలియడం, వారంతా తనకే ఫోన్ చేసి మళ్లీ దానిని గుర్తుచేస్తుండడంతో చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. అలా విసుగ్గా వున్న సమయంలోనే మళ్లీ చంద్రబాబు ఫోన్ మోగింది. వెంటనే చంద్రబాబు ఆ నెంబర్‌ను చూడకుండా ఫోన్ ఎత్తి.. చెప్పండి, ఆ చెప్పు పంచాయితీయేనా... అని కోపంగా అడిగాడు. అప్పుడు అవతల నుండి... కూల్ చంద్రబాబుజీ కూల్ అనే వాయిస్ వినపడింది. చంద్రబాబు బిత్తరపోయి... మోడీ సాబ్, ఏంటి విషయం అని అడిగాడు. అవతల నుండి ప్రధాని మోడీ... ఇప్పుడే జగన్ వచ్చి వెళ్లాడు. 'చెప్పు' కథ చెప్పి పోయాడు. రాజకీయాలలో మీరు ప్రొఫెసర్. అతను ఎల్‌కెజి స్టూడెంట్. పెద్ద మనసుతో అటువంటివి పట్టించుకోకండి అని చెప్పి పెట్టేసాడు. మోడీ ఫోన్‌తో చంద్రబాబుకు జుట్టు పీక్కోవాలనిపించింది. అయినా తమాయించుకుని కూల్ అయ్యి... వెంటనే జగన్‌కు ఫోన్ చేశాడు. జగన్ ఫోన్ ఎత్తాడు. ఈ 'చెప్పు' పంచాయితీ ఇంకా ఎంతమందికి చెబుతావని చంద్రబాబు అడిగాడు. పదిమందికి చెబితే చేసిన పాపం పోతుందని మా అమ్మ చెప్పింది. అందుకే పదిమందికి చెప్పాను అని అన్నాడు. ఆ పదిమందికి బదులు నాకే ఫోన్ చేసి చెప్పుంటే ఈ పంచాయితీని ఇక్కడితో వదిలేసే వాడిని కదా అని చంద్రబాబు అడిగాడు. 'మా అమ్మ పదిమందికి చెప్పమంది... నేను మా అమ్మ మాట జవదాటను' అంటూ జగన్ ఫోన్ పెట్టేసాడు. అది విన్న చంద్రబాబు సెల్‌ఫోన్‌ను తలకేసి కొట్టుకున్నాడు.



## కావలి కబుర్లు

# ఉద్దేశ్యపూర్వకంగానే ప్రజలను మోసం చేశారు

**- ఎమ్మెల్యే ప్రతాప్**



1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డదారిలో అధికారం పొందడానికి ఉద్దేశ్యపూర్వకంగానే మోసపూరిత మ్యానిఫెస్టో తయారు చేయించి రాష్ట్ర ప్రజలందరిని నమ్మించి మోసం చేశారని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రనాయకులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చంద్రబాబు చేసిన మోసాలపై నిరసన తెలియచేస్తూ... బుధవారం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలపై 1వపట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసి చట్టప్రకారం శిక్షించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి రెండుసంవత్సరాలు పూర్తయినా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. రైతులకు ఋణమాఫీ, ఆడపడుచుల బంగారం బ్యాంకులనుండి విడుదల, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డ్వాక్రా మహిళల ఋణ విముక్తి వంటి ఎన్నో వాగ్దానాలను చేశారన్నారు. ఈ వాగ్దానాల ద్వారా ప్రజలు మరింత నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధానిలో భూకబ్జాలు, పట్టిసీమ పర్సెంటేజ్‌లు, ఇసుక మాఫియాలు చేస్తూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు దండా క్రిష్ణారెడ్డి, గోగుల వెంకయ్య, తూపిలి పెంచలయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనుమర్లపూడి వెంకటనారాయణ, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి కామరాజు, డీఆర్‌యుసిసి సభ్యులు కామయ్య, జిల్లా కార్యదర్శి జి ప్రసన్నాంజనేయులు, నాయకులు జంపాని రాఘవులు, ఎస్ ప్రసాద్, కౌన్సిలర్లు దేగా రామయ్య, శ్రీనివాసులు, రాజశేఖర్, మాల్యాద్రి, చిన్నపుల్లయ్య, మదనమోహన్‌రెడ్డి, బోగోలు ఎంపిపి టి సులోచనమ్మ, అల్లూరు ఎంపీపీ జి మంజుల, నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, అంకబాబు, చిట్టిబాబు, శ్రీహరినాయుడు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీను, మాల్యాద్రి, బాబుల్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమరనాధ్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# కోరీడ్ గైనకాలజీ శిబిరం

కోరీడ్ సంస్థ ఆధ్వర్యంలో కావలి మండలంలోని పేపర్లవారిపాలెం గిరిజన కాలనీలో మహిళలకు గైనకాలజీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 500మంది స్త్రీలకు డా॥ పద్మ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రావెల జయపాల్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మహిళలకు గైనకాలజీ క్యాంపు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, ప్రభుదాస్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.





స్త్రీలకు ఉచితంగా పరీక్షిస్తున్న డాక్టర్ పద్మ

# చెట్లు.. ప్రగతికి మెట్లు



మొక్కను నాటుతున్న అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కెవి రామక్రిష్ణయ్య

చెట్లు... ప్రగతికి మెట్లని, ప్రతి ఒక్కరూ ఇంటికొక మొక్కను నాటాలని అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కెవి రామక్రిష్ణయ్య అన్నారు. ఆదివారం స్థానిక ముసునూరులోని రాఘవేంద్రా కాలనీలోని సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలను నాటి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో నన్ను భాగస్వామిని చేసినందుకు విద్యుత్‌శాఖ సిబ్బందికి ధన్యవాదాలు తెలియచేస్తున్నామని, పెద్దఎత్తున మొక్కలు నాటి పర్మావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. మన ఇల్లు చుట్టూ పరిసరాలు పచ్చగా ఉండాలంటే మొక్కలు నాటాలన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ నాగరికతవల్ల చెట్లు నరికేస్తున్నారని, కాని చెట్లను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని, అప్పుడే పర్యావరణాన్ని కాపాడుగలుగుతామని, దాంతో సకాలంలో వర్షాలు పడతాయన్నారు. గ్రామం బాగుంటే దేశం సస్యశ్యామలంగా ఉంటుందని మొక్కలు నాటడంవల్ల భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించే వారిమి అవుతామన్నారు. ప్రతి ఇంట్లో ఒక చెట్టు ఇంకుడు గుంట ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యం, ధ్వని కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించ వచ్చన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు మాలకొండారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ముఖ్యంగా యువతపై ఉందని ప్రతి ఇంట్లో మొక్కలు నాటేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు కోటేశ్వరరావు, మోహనయ్య, కేశవ, ఖాదర్, మధు, రాజ్‌కుమార్, వెలుగొండారెడ్డి, డి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



## శేషన్న సేవలకు...

# నిలువెత్తు నివాళి

### 12న 'డాక్టర్ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం' ప్రారంభం

డాక్టర్ జెట్టి శేషారెడ్డి అంటేనే నెల్లూరు రామచంద్రారెడ్డి ఆసుపత్రి గుర్తుకొస్తుంది. రామచంద్రారెడ్డి ఆసుపత్రి అంటేనే డాక్టర్ శేషారెడ్డి చిరునవ్వు కనిపిస్తుంది. ఆసుపత్రి–డాక్టర్ ఒకరే అన్నట్లుగా కలగలిసివుండే అద్భుతం ఒక్క రామచంద్రారెడ్డి ఆసుపత్రిలోనే కనిపించేది. ఎందుకంటే, ఈ రెండింటిలో ఏ ఒక్కరిని చూసినా ఆ రెండు వ్యవస్థలనూ చూసినట్లే. అంతగా వైద్యరంగంలో మిళితమైపోయారు డాక్టర్ శేషారెడ్డి. ఆయనో విజ్ఞాన ఖని. వైద్యరంగాన్నే ప్రకాశింపజేసిన విద్వన్మణి. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఆయనే ఒక ఆసుపత్రి. ఇప్పుడు మన మధ్య లేకపోయినా.. ఆయన రూపం, ఆ మందహాసం అందరికీ చెరగని జ్ఞాపకాలుగా మన మనసుల్లో ఎల్లప్పుడూ నిలిచేవుంటాయి. రోగుల పట్ల ఆయన కనపరచిన అత్యంత శ్రద్ధ, ప్రజారోగ్యం పట్ల ఆయనకున్న సేవానిరతి ఆయన్ను చిరస్మరణీయుడిని చేశాయి. ఇప్పుడాయన పేరుతో డాక్టర్ శేషారెడ్డి విజ్ఞానకేంద్రం నెల్లూరులో ప్రారంభమవుతున్నదంటే అది అభిమానులు, మిత్రులు ఆయనకు అందిస్తున్న ఘనమైన నివాళే అనవచ్చు. ఇప్పుడాయన స్మృతిలో ఎంతో వ్యయప్రయాసలతో ఆయన అభిమానులు నెల్లూరు అపోలో ఆసుపత్రి ఎదురుగా.. అత్యద్భుతంగా నిర్మించిన డా.శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం ఆ మహనీయుని సేవలకు నిలువెత్తు నిదర్శనంగా అనిపిస్తోంది. ఈ విజ్ఞానకేంద్రాన్ని ఈ నెల 12న ఉదయం 10గంటలకు 'హిందూ' పత్రిక పూర్వ సంపాదకులు ఎన్.రామ్ ప్రారంభించనున్నారు. ఈ విశేషమైన కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేయర్ అబ్దుల్‌అజీజ్, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వితపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు పి. అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమల్లి మధు, మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని కృష్ణయ్య, జక్కా వెంకయ్య, కార్పొరేటర్ ఊటుకూరు మస్తానమ్మ, ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ డా.పి.అజయ్‌కుమార్, సీనియర్ డాక్టర్ సూరా రవీంద్ర, డాక్టర్ శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మెన్ చంద్ర రాజగోపాల్ తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రజలు..వైద్యులు..డా.శేషారెడ్డి అభిమానులందరూ ఈ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ ట్రస్ట్ నిర్వాహకులు కోరుతున్నారు.

# ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి



సిఐకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

గత ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తెలుగుదేశంపార్టీ అనేక వాగ్ధానాలు, హామీలు ప్రజలకు ఇచ్చిందని, ఆ హామీలు నమ్మి ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశారని, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా హామీలు అమలు మాత్రం కాలేదని నిరసిస్తూ 8వతేదీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్‌లు, నాయకులు నెల్లూరు నగరంలోని 4వ నగర పోలీస్‌స్టేషన్‌కి వచ్చి హామీలు ఉల్లంఘించిన దానికి నిరసనగా చంద్రబాబుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్ల కోసం, అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు ఇచ్చి, నేడు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా హామీలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్‌లు బొబ్బల శ్రీనివాసయాదవ్, లేబూరు పరమేశ్వరరెడ్డి, డా॥ సత్తార్, గుండాల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు 'సన్నిహిత' పురస్కారాలు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జేసీ ఇంతియాజ్ అహ్మద్

నెల్లూరులోని 'సన్నిహిత' సేవాసంస్థ ఆధ్వర్యంలో, ఇటీవల టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 7న ప్రతిభా పురస్కారాలు బహుకరించారు. జిల్లాలోని 46 మండలాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. నెల్లూరు టౌన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ ఎం.డి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఎంతో అంకిత భావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థినేనని అంటూ, విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నతశిఖరాలను అందుకోవాలన్నారు. ఈ సందర్భంగా, మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.3వేలు, ద్వితీయస్థానం సాధించిన విద్యార్థికి రూ.2వేలు వంతున మొత్తం 168 మందికి సన్నిహిత సేవాసంస్థ ప్రోత్సాహకాలు అందించింది. 'సన్నిహిత' అధ్యక్షుడు దొడ్ల జగన్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి పెంచలరెడ్డి, సింహపురి ఆసుపత్రుల ఎం.డి కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, ఎస్ఎస్ఏ ప్రాజెక్టు అధికారి వి.కనక నరసారెడ్డి, ఎఎంఓ అబ్దుల్ హమీద్‌తో పాటు, 'సన్నిహిత' సేవాసంస్థ అధ్యక్షులు డి. జగన్మోహన్, గౌరవాధ్యక్షులు నాళం వెంకటేశ్వర్లుతో పాటు, క్రొత్తపల్లి మధుసూదనశాస్త్రి, బట్టు వెంకట్రావు, ఎ.జేమ్స్ కరుణాకరన్, జి.వి భాస్కర్, బి.శ్రీనివాసయాదవ్, కె.రాజ తదితర ఉపాధ్యాయ మిత్రులు పాల్గొన్నారు. కె.మధుసూదనశాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, శక్తి గ్రాఫిక్స్ అధినేత బి.మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

# సింగపల్లికి 'శ్రీశ్రీ పురస్కారం'

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 2016 సంవత్సరానికి 'శ్రీశ్రీ' పురస్కారాన్ని విజయవాడకు చెందిన ప్రముఖ రచయిత సింగపల్లి అశోక్‌కుమార్‌కు ఇవ్వనున్నట్లు సంఘం అధ్యక్షకార్యదర్శులు చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు నెల్లూరు యష్‌పార్క్ హోటల్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేస్తామని, చారిత్రక పరిశోధకులు కాళిదాసు పురుషోత్తం, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య నాయకులు కోట గురుబ్రహ్మం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

# అరుణమ్మ జ్ఞాపకార్థం అన్నదానం



ఈ నెల 4వ తేదీ నెల్లూరు, రామ్మూర్తినగర్‌లోని సత్యసాయి మందిరంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్గీయ పందిళ్ళపల్లి అరుణమ్మ జ్ఞాపకార్థంగా విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దాదాపు 300మంది భక్తులకు అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డా॥ పెంచలయ్య, జె.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు, ఎం.ఎస్.రాజు, చంద్రలీల, మహేష్‌రెడ్డి, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌మొండి

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి కష్టమే ఇంకో నాయకుడికి వచ్చివుంటే ఇదివరకే జెండా దించేసి, షట్టర్ మూసేసి పార్టీ కార్యాలయానికి తాళం వేసుండేవాడు. కాని అక్కడున్నది వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి. దివంగత నేత వై.యస్. బ్లడ్ అది. అనుచరులను కాపాడుకోవడంలో, నాయకులతో సంబంధాలు నెరపడంలో వై.యస్. లక్షణాలను పుణికి పుచ్చుకోకపోయినా ఆయన మొండితనాన్ని మాత్రం జగన్ వంట బట్టించుకున్నాడు. ఆ మొండితనంతోనే తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధికారం, ధనం అన్న ఆయుధాలతో తన మీద దాడికి దిగినా ఏ మాత్రం వెనక్కుతగ్గకుండా పోరాడుతున్నాడు.

ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై అతను పెంచిన విమర్శల దూకుడు రాజకీయ విశ్లేషకులను కూడా ఆశ్చర్యపరుస్తోంది. తన పార్టీ ఎమ్మెల్యేలు వరుసబెట్టి పోతుంటే ఏ నాయకుడైనా డీలా పడిపోతాడు. కాని జగన్ రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాడు. చంద్రబాబుపై 'చెప్పు' వంటి పదాలతో విమర్శలు గుప్పిస్తున్నాడు. 'చెప్పు' మాటతో తెలుగుదేశం శ్రేణులు జగన్‌పై మూకుమ్మడిగా దాడికి దిగినా జగన్ ఏ మాత్రం లెక్క చేయక, చంద్రబాబుకు చెప్పులు ఇష్టం లేదంట, చీపుర్లు చూపించడంటూ కొత్త పల్లవినందుకున్నాడు. తెలుగుదేశం నాయకులు జగన్‌పై ఆరోపణలు, విమర్శలు పెంచేకొద్ది అది జగన్‌వైపే ప్రజలలో సానుభూతిని పెంచుతోంది. దీంతో తెలుగుదేశం నాయకులు జగన్ ఏం మాట్లాడినా నోర్లు కట్టేసుకోవాల్సి వస్తోంది.

భారత దేశంలోనే సోనియాను ఢీకొట్టి నిలిచిన మొనగాడు జగన్. ఆమెతో రాజీపడకుండా 16నెలలు జైలులో గడిపాడు. సోనియాతో పేచీ పెట్టుకున్న శరద్‌పవార్, మూపనార్, కరుణాకరన్ వంటి వాళ్ళే తర్వాత ఆమెతో రాజీపడ్డారు. కాని, జగన్ ఆమెకు తలొంచలేదు. ఆ మొండితనమే ప్రధాని మోడీకి సైతం నచ్చింది. అందుకే చంద్రబాబు కంటే కూడా కేంద్రంలో జగన్‌కే విలువ ఎక్కువ. కేంద్రం ఉందన్న ధైర్యంతోనే జగన్ చంద్రబాబుపై దూకుడు పెంచాడనిపిస్తోంది.

# నవ నిర్మాణ నాటకం

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో ఆసక్తిగా విన్నాం. నవనిర్మాణ సంకల్ప దీక్షల పేరిట ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన జాతర చూసాం. 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో నాయకులు, ఉద్యోగులు పనులను పక్కన పెట్టేసి నవసంకల్ప దీక్షల పేరుతో చేసిన జాతరను చూసాము. అసలీ సంకల్ప దీక్షలు ఎందుకు? ఏం పొడిచారని ఈ సంకల్ప నాటకాలు!

రెండేళ్ళలో ఏం జరిగింది. ఏం జరగలేదన్నది పరిశీలిస్తే... ప్రజల ఆలోచనలు, ఆశలు, అభిప్రాయాలకు దూరంగా చంద్రబాబు పాలన కొనసాగుతోంది. అసలు ప్రభుత్వమే ఒక ప్రైవేట్ కంపెనీగా నడుస్తున్నట్లుంది.

గోదావరి పుష్కరాలకు 2వేల కోట్లు, పట్టిసీమకు 1400కోట్లు, సింగపూర్ లాంటి అమరావతి రాజధాని, చంద్రన్న కానుకలు, అమరావతి బస్సులు, హెరిటేజ్ మజ్జిగ ప్యాకెట్లు, సచివాలయానికి కోట్ల రూపాయలతో సోకులు... రాష్ట్ర ప్రజలు కోరుకున్నవి ఇవి కాదు. వీటివల్ల ప్రజలకు పెద్దగా వచ్చే ప్రయోజనం కూడా ఏమీ లేదు. ముఖ్యంగా 50వేల ఎకరాలలో చంద్రబాబు కట్టాలనుకుంటున్న రాజధాని వల్ల ఆయన, ఆయన మంత్రులకు, ఇతర నాయకులకు ఉపయోగముంటుందేమోగాని, రాష్ట్ర ప్రజలకు నయాపైసా ప్రయోజనం లేదు. కాని చంద్రబాబు అమరావతి రాజధానిని కట్టడమే తన జీవిత కర్తవ్యంగా పెట్టుకున్నాడు. ఇక దండగమాలిన కార్యక్రమాలు పెట్టి ఖజానాలో చిల్లిగవ్వ లేకుండా ఖాళీ చేయించాడు.

ఈరోజు అన్ని జిల్లాల్లోనూ ప్రజలు కోరుకునేది తమ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందాలని! తమ ప్రాంతాలలోనూ పరిశ్రమలు రావాలని, ఉపాధి అవకాశాలు పొందాలని, రోడ్లు, డ్రైనేజీ, మంచినీళ్లు, సాగునీళ్లు, డ్యాంలు, చెరువులు, కాలువలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు వంటివి ఏర్పడాలని, ప్రతి ఒక్కరికీ చేతినిండా పని ఉండాలని కోరుకుంటున్నారు. అభివృద్ధినంతా ఒకేచోట కేంద్రీకరించి హైదరాబాద్ లాంటి చరిత్ర మళ్ళీ పునరావృతం కాకూడదని ప్రజలు కోరుతున్నారు. కాని చంద్రబాబు మనసుకు అది తడితే కదా! నేను నీతిపరుడుని, నేను నిప్పును అని చంద్రబాబు డబ్బా కొట్టుకుంటున్నాడు. లంచం ఇవ్వకుండా ఏ ప్రభుత్వ కార్యాలయంలో పని జరుగుతుందో చంద్రబాబు చెప్పగలడా? ఇక భారత చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా రైతు ఋణమాఫీ చేసానని చంద్రబాబు చెప్పుకుంటున్నాడు. ఋణమాఫీపై బాబు ఇచ్చిన హామీకి ఆచరణలో చేసిన దానికి ఏ మాత్రమైనా పొంతన ఉందా?

రాష్ట్రాభివృద్ధి కోసం ఈ రెండేళ్ళు చంద్రబాబు చేసింది శూన్యం. వాస్తవంగా చేయాల్సిన పనులను, ప్రజలకు అవసరమైన అభివృద్ధిని వదిలేసి ఈ రెండేళ్లలో ఆయన గాలి మేడలకు మాత్రమే శంకుస్థాపన చేశాడు. ఇంకో ఏడాది ఆగితే ఆ గాలి మేడలకే ప్రారంభోత్సవం కూడా చేస్తాడు. మాటలు కూడా కోటలు దాటుతుంటాయి. చంద్రబాబు ఇలా గాలి మేడలు కట్టుకుంటూ పోతే రాష్ట్రాభివృద్ధి గాలికి పోయినట్లే!



నెల్లూరు భాషకి.. యాసకి అద్దం పడుతూ

స్థానిక వార్తలతో, విశేషాలతో వారం వారం అలరిస్తూ...

దిగ్విజయంగా 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న

లాయర్

తెలుగు వారపత్రికకు

శుభాకాంక్షలు.




బి.సుబ్బారెడ్డి

మేనేజింగ్ పార్టనర్

వంశీరామ్ బిల్డర్స్

ప్లాట్ నెం. 601, జ్యోతి ఎస్టేట్, ప్లాట్ నెం. 106, శ్రీనగర్ కాలనీ, హైదరాబాదు - 73. ఫోన్: 040-23752266


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com